

# మనం



## అనంతపురం / శ్రీ సత్యసాయి జిల్లా

సోమవారం - 9 - ఫిబ్రవరి - 2026 : పేజీలు 12


## నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు

○ జిల్లా ప్రజలు గమనించాలి ○ జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**అనంతపురం,కలెక్టరేట్ ఫిబ్రవరి 08 మనంన్యూస్ :** అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో నేడు నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్),రెవెన్యూక్లినిక్ కార్యక్రమం రద్దు చేయడం జరిగిం దని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించే మంత్రులు, సెక్రటరీలు, హెచ్ఓడిల కాన్ఫరెన్స్ కారణంగా రద్దు చేయడం జరిగిందని వివరించారు.పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం రద్దు విషయాన్ని జిల్లా ప్రజలు

మిగతా 3లో

## నీలకంఠాపురంలో సంచరించుకున్న ఆధ్యాత్మిక శోభ

➲ డాక్టర్ గరికపాటి నరసింహారావు వారి ప్రవచనామృతం ఆలకించేందుకు పోటెత్తిన జనం



**మడకశిర, ఫిబ్రవరి 08, మనంన్యూస్:** నీలకంఠాపురం దేవస్థానములలో ఆదివారం ఆధ్యాత్మిక శోభ సంచరించుకుంది. దేవస్థానములు ఆధ్వర్యంలో నిర్వహించిన మహా సహస్రఅవదాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ శ్రీ గరికిపాటి నరసింహారావు వారి నీలకంఠా ష్టకం అంశంపైప్రవచనం కార్యక్రమానికి జనంపొటెత్తారు.దింతో నీలకంఠాపురం దేవస్థాన ప్రాంగణం ఆధ్యాత్మికచైతన్యంతో పులకించి పోయింది. ఆదివారం సాయంత్రం ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ గరికపాటి నరసింహారావు గారి ప్రవచన కార్యక్రమం అత్యంత వైభవంగా ప్రారంభమైంది.మొదట డాక్టర్గరికిపాటితోపాటు దేవస్థానములు అభివృద్ధి కమిటీ చైర్మన్

మిగతా 3లో

# ఎక్సైజ్ అధికారుల కల్లు కల్తీ

✦ అనంతపురం జిల్లాలో విచ్చలవిడిగా కల్తీ కల్లు తయారీ ✦ అనారోగ్యం బారిన ప్రజలు
✦ కోట్లకు పడగలెత్తిన తయారీ మాఫియా ✦ ప్రాణాలను హరిస్తున్న కల్లు పెంటలు

*కల్లు కల్తీ చేస్తారనేది అందరికీ తెలిసిందే.. అయితే అనంతపురం జిల్లాలో ఎక్సైజ్ అధికారుల కళ్ళు కూడా కల్తీ అయ్యాయని మేధావులు అభిప్రాయ పడుతున్నారు. విచ్చలవిడిగా కల్తీ కల్లు తయారీ, అమ్మకాలు జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, కల్లు కల్తీ జరుగుతున్న విధంగానే ఎక్సైజ్ అధికారుల కళ్ళు కూడా కల్తీ అయ్యాయనే ఆరోపణలు వస్తున్నాయి. అనంతపురం జిల్లాలో కల్తీ కల్లుకు అమాయకులు బలైపోతున్నారు. ప్రధానంగా కనేకల్లు, బొమ్మనహాలు మండలాల్లో పెద్ద ఎత్తున కల్తీకల్లు విక్రయాలు సాగుతున్నా.. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.*





**అనంతపురం 'మనం' కరస్పాండెంట్ కొత్తూరు లక్ష్మీనారాయణ ఫిబ్రవరి 8 :** అనంతపురం జిల్లాలో కల్తీ కల్లుకు అమాయకులుబలైపోతున్నారు. బొమ్మనహాల్, కనేకల్లు, గుంతకల్లు, రాయదుర్గం, పెద్దవడుగూరు, ఉరవకొండ,విడపనకల్లుమండలాల్లో విచ్చలవిడిగా కల్తీకల్లు అమ్మకాలు సాగుతున్నాయి. నిత్యం వేల లీటర్ల కల్తీకల్లు విక్రయాలు సాగుతున్న ఎక్సైజ్ అధికారులు చూసి చూడనట్లువ్యవహరిస్తున్నారనేఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.క్లోరోఫామ్,డైజొఫామ్ వినియోగించి కల్తీ కల్లు తయారు చేస్తారు. క్లోరోఫామ్, డైజొఫామ్ వాడడం వల్ల నిద్ర రావడం, మత్తు ఎక్కువై కిడ్నీలపై ప్రభావం చూపుతుంది. కల్తీ కళ్ళు తాగిన వారు కళ్ళు చీపుర్లు కట్టి నాలుగు రోజులైనా మత్తు దిగకపోవడంతో

మిగతా 2లో

## ఓ సుబ్బు ఓ శబరి ఓ అధికారి

# రోడ్డునే హాంఫట్



■ మూకుమ్మడిగా ఫిర్యాదు చేసిన సాగుతున్న అక్రమ నిర్మాణం
■ కోర్టును ఆశ్రయించేందుకు స్థానికుల సమాయత్తం
■ చోద్యం చూస్తున్న జిల్లా ఉన్నత అధికార'పాలకులు

2 లో

కాస్త డబ్బు ఉండి కాస్త పలుకుబడి ఉంటే చాలు రోడ్డులోనైనా నిర్మాణాలు కట్టుకోవచ్చు అనడానికి ఇదో ఉదాహరణ. అనంతనగరంలో ఇప్పటికే చాలా చోట్ల భూమి ఆక్రమణ వివాదాలను నడుస్తున్నాయి. ఎన్ని వివాదాలు నడిచిన ఎంత చెడ్డ పేరు వచ్చిన మేము పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్నట్లుగా అనంతలో కొందరు అధికార పాలకుల వ్యవహారం నడుస్తుంది. మూకుమ్మడిగా జనం ఫిర్యాదు చేసిన మాకు డబ్బు వస్తే చాలు ఎవడు ఎలా పోతే మాకేంటి అన్నట్లుగా వారు వ్యవహరిస్తున్న తీరు మొత్తం ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా ఉంది.



**అనంతపురం, ఫిబ్రవరి 8 మనంన్యూస్ :** మనం దినపత్రిక నిన్నటి రోజు అనంత ప్లానింగ్‌లో బెటర్ ( భవంతుల ద్వారా రూకోట్లలో ప్రభుత్వానికి రావాల్సిన 14% బెటర్మెంట్ చార్జీలను ) గా మేస్తున్నారు అంటూ ఓ కథనాన్ని ప్రచురించాము. వీటికి

## ఆదాయం బాగున్న కార్యాలయం అధ్వానం...!



మిగతా 2లో

**ధర్మవరం అర్బన్ ఫిబ్రవరి 8 మనంన్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా పురోగతి సాధించడానికి ఎక్సైజ్ శాఖ ఎంతో దోహదపడుతుంది. ఆదాయం బాగున్న ఆ శాఖ కార్యాలయం అధ్వానంగా ఉంది. ఇదెక్కడంటే... ధర్మవరం నియోజకవర్గంలోని ధర్మవరం తహసిల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ప్రొహిబిషన్–ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయం ఉంది. ఈ కార్యాలయంలో ఆ శాఖ సిఐ, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది రేకుల షెడ్డు, పెంకు షెడ్డులో విధులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలం పెంక్ షెడ్డులో వర్షపు నీరు కురుస్తుండడంతో రికార్డులు తడవడంతో పాటు అధికారులు కూర్చోవడానికి కూడా ఇబ్బందికరంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో సీఐ ఉంటున్న గదితో పాటు సాంకేతిక పరికరాలు , రికార్డులు తడవకుండా ముందస్తుగా పెంకు కొట్టంపై ప్లాస్టిక్ కవర్ ను కప్పారు. ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో దాదాపు 20కి పైగా వైన్ షాపులు, బార్లు ఈ శాఖ పరిధిలో ఉన్నాయి. ప్రతి నెల లక్షలు వ్యాపార లావాదేవీలు ఎక్సైజ్ శాఖ

# ఓ సుబ్బు ఓ శబరి ఓ అధికారి రోడ్డునే హోంఫట్



కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు ఇలా



అది రోడ్డే అని స్పష్టంగా తెలియజేసిన సర్వేయర్ రిపోర్ట్

తలదన్నే విధంగా అనంతలో మరో రకమైన వ్యవహారం నడుస్తుందని తెలిసింది. అదే డబ్బిస్తే చాలు రోడ్డు, కాలువ, వంకలు, వాగులు అనే తేడా లేకుండా ఏదైనా ఆక్రమించుకుని ఏ నిర్మాణమైన చేపట్టొచ్చు మీ జోలికి ఎవరు రారు అంటున్నారట అనంతనగరంలోని కొందరు అధికార పాలకులు. అలాంటిదే అనంతనగరంలో ఇది ఒకటి. ఓ సుబ్బు ఓ శబరి ఓ అధికారి కాసుల కక్కుర్తి అనంతనగరంలోని గుత్తి రోడ్డు ఎన్టీఆర్ మార్గము దగ్గరలో ఉన్న సర్వేనెంబర్ 195-6లోని కాలనీకి ఇదే సర్వేనెంబర్ 195-6 లోనే ఎన్టీఆర్ మార్గం నుండి లింకు రహదారి , డ్రైనేజీ మార్గమును మాస్టర్ ప్లాన్ లోను కేటాయించిన త్రిభుజాకారంలోని స్థలాన్ని అదే అదే పై చెప్పిన ఆ వ్యక్తులు ఓ సుబ్బు ఓ శబరి ఓ అధికారి సహకారంతో చకచకా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ రహదారి ఆక్రమణకు సంబంధించి కాలనీలోని పలువురు ప్రజలు నేరుగా నగరపాలక సంస్థ అధికారులకు సర్వే రిపోర్ట్ ఆధారంగా ఫిర్యాదు చేసిన ఏ ఒక్కరు కూడా చర్యలకు అడుగులు వేయకపోవడం వెనుక భారీ స్థాయిలో డబ్బు ముట్టిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ప్రజల సమస్యలకు ముందుండి పోరాడుతామని చెబుతున్నా కమ్యూనిస్టులు, ప్రజా, కుల సంఘాల నాయకులు, ప్రతిపక్ష పార్టీలు సమస్య స్పష్టంగా తెలుస్తున్న నిద్రమత్తు నటిస్తూ ఉండడం పై కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రహదారి ఆక్రమణ భవన నిర్మాణ పనులకు సంబంధించిన ఎవరి సుబ్బు, ఎవరి శబరి ఎవరా అధికారి ద్వారా చేయించుకున్నారు ఎంత మొత్తంలో చేతులు మారింది అన్నది కూడా స్పష్టంగా మనం తెలియజేసే ప్రయత్నం చేద్దాం మరో కథనంలో.

# రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన మంత్రి సవిత



**పెనుకొండ ఫిబ్రవరి 8 మనంన్యూస్** : పెనుకొండ మండలంలోని గుట్టూరు జాతీయ రహదారి వద్ద హిందూపురం నుంచి ధర్మవరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు అనంతపురం నుంచి బెంగళూరు వెళ్తున్న లారీని ఢీకొనగా బస్సులో ఉన్న 10 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాల య్యాయి. రోడ్డు ప్రమాద బాధితులను పోలీసులు పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న మంత్రి సవిత ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించి, ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు ఆదేశించారు.



# ఎక్సైజ్ అధికారుల కల్లు కల్తీ

ఒక రకమైన పిచ్చి మరియు మానసిక రుగ్మతకు గురవుతారు. కల్తీ కల్లు తయారు చేసిన వాళ్ళు కోట్లకు పడగలెత్తుతున్నారు. కల్లుపెంటల్లో విక్రయిస్తున్న వారు కూడా మంచి లాభాలు గడిస్తున్నారు. మాఫియాను చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులకు నెల నెల పెద్ద ఎత్తున మామూలు అందుతున్నాయి. అయితే కల్తీ కల్లుకు బానిసలైన వ్యక్తుల కుటుంబాలు మాత్రం ఛిద్రమైపోతున్నాయి. అతి చిన్న వయసులోనే అనేకమంది కుటుంబ పెద్దను కోల్పోతున్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో క్లోరల్ హైడ్రేట్ అనే ప్రాణాంతకమైన రసాయనంతో తయారు చేసిన కల్తీ కల్లును విచ్చలవిడిగా అమ్ముతున్నారు. ఈ కల్తీ కల్లు వల్ల ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుని ఎంతో మంది మహిళలు చిన్న వయసులోనే వితంతువులుగా మారి జీవితాలు నాశనం అవుతున్నాయి. రాయదుర్గం నియోజక వర్గంలో బొమ్మనహాళ్లు, కనేకల్లు విచ్చలవిడిగా కల్తీ కల్లు అమ్ముతున్నారు. పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన పలు గ్రామాలకు ఇక్కడి నుంచే



కల్తీకల్లు సరఫరా అవుతోంది. ఆంధ్ర మరియు కర్ణాటక రెండు రాష్ట్రాలకు సంబంధించిన ఎక్సైజ్ అధికారుల సమన్వయ సమావేశంలో కర్ణాటక ఎక్సైజ్ అధికారులు ఈ విషయాన్ని ఆంధ్ర ఎక్సైజ్ అధికారులకు తెలియజేసి, ఆంధ్రప్రదేశ్ నుంచి కర్ణాటకకు అక్రమంగా సరఫరా అవుతున్న కల్తీ కల్లును నియంత్రించవలసిందిగా కోరారు. కానీ రాయదుర్గం నియోజకవర్గం కనేకల్లు బొమ్మనహాల్ ఎక్సైజ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మరింత విచ్చలవిడిగా కల్తీ కల్లు అమ్మకాలను మరింత ఎక్కువగా సాగిస్తున్నారు. కనేకల్లు బొమ్మనాలు ప్రజలు కల్తీ కల్లు తాగి వందలాది మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు. సరిహద్దు గ్రామాల ద్వారా సరఫరా అవుతున్న కల్తీ కల్లును తాను ల్యాబ్ కు పంపగాఅందులో ప్రాణాంతకమైన క్లోరల్ హైడ్రేట్ రసాయాలుఉన్నాయనితేలిందనిగతంలో బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు దృష్టికి కొంత మంది బాధితులు తెచ్చినట్లు బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు తెలిపాడు. అయినా ఎక్సైజ్ అధికారుల అండతో క్రమ కల్తీ కల్లు వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా రోజురోజుకూ పెరిగిపోతోంది. ఈ అక్రమ కల్తీకల్లు వ్యాపారంలో ఎక్సైజ్ అధికారులు, ముఖ్య తెదేపా నాయకుల వాటాదారులుగా ఉన్నట్టు ప్రజలు మాట్లాడుకుంటు న్నారు. ఈ అక్రమ కల్తీకల్లు వ్యాపారం ఎప్పటికి ఆగుతుందో అర్థం కాని పరిస్థితులు రాయదుర్గం నియోజకవర్గంలో కనపడుతున్నాయి.

## ఆదాయం బాగున్న కార్యాలయం అధ్వానం...!

ద్వారా జరుగుతున్నప్పటికీ పక్కా భవనం లేక ఆ శాఖ అధికారులు ఇబ్బం దులు పడుతున్నారు. పాలకులు మారుతున్నారు. ఆదాయ మార్గమున్న ఆ శాఖనుఅభివృద్ధిచేయడంలోఉదాసీనతగావ్యవహరిస్తున్నారని పలువురు చర్చిం చు కోవడం గమనార్హం. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు దృష్టి కేంద్రీకరించి సిఐ కార్యా లయానికి పక్కా భవనం నిర్మించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.




# ఏ వయసులోనైన ఫిట్స్ రావచ్చు : డా. పి.కార్తీక్ రెడ్డి

### నేడు అంతర్జాతీయ ఎపిలెప్సి దినోత్సవం

**అనంతపురం ఫిబ్రవరి 08 మనం న్యూస్ ప్రతినిధి:** ఎపిలెప్సి ( మూర్ఛ లేదా వాయి జబ్బు) గురించి ఇప్పటికీ ప్రజల్లో అనేక య అపోహలున్నాయి, వారిని ప్రత్యేక దృష్టితో చూస్తారు. వైద్య విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందింది,ఫిట్స్ నియంత్రణకు ఎన్నో మందులు అందుబాటులో ఉన్నాయని అనంతపురం కిమ్స్ సవీర హాస్పిటల్ న్యూరాలజిస్ట్ పి. కార్తీక్ రెడ్డి తెలిపారు. మూర్ఛ వ్యాధికి సకాలంలో వైద్య చికిత్సలందిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయి. మందులతో తగ్గని ఫిట్స్‌కు సర్జరీ ద్వారా కూడా నయం చేయవచ్చు. ప్రతి యేటా అంతర్జాతీయ ఎపిలెప్సి దినోత్సవం నిర్వహిస్తారు. దీని ఉద్దేశం ప్రజలలో అవగాహన కల్పించడమే. ఈ జబ్బు ఉన్న స్త్రీలు వివాహాలు చేసుకోవచ్చు. మందులు వాడితే జబ్బు అదుపులో ఉంటుంది. గర్భిణిగా ఉన్నప్పుడు ఫిట్స్ కు మందులు వాడొచ్చు. దీని వల్ల తల్లికీ, బిడ్డకు ప్రమాదం ఉండదు, అయితే కొన్ని రకాల మందులను ఈ సమయంలో మార్చవలసి ఉంటుంది, కావున నరాల వైద్య నిపుణులను సంప్రదించాల్సిన అవసరం ఉంది. మూర్ఛ(ఎపిలెప్సీ,ఫిట్స్) ప్రతి 1000 మందిలో నలుగురికి ఉంటుంది. ఇది ఏ వయసులోనైన రావచ్చు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు వచ్చే అవకాశముంది. కానీ సాధారణంగా ఇది రెండేళ్ల వయసులోపు, ఆ తర్వాత 50, 60 ఏళ్లు పైబడిన వారిలో వస్తుంది. మధ్య వయసులో రావడం తక్కువే. మూర్ఛ మొదలైన తర్వాత వీరిలో నియంత్రణ లేకపోవడం వల్ల దీర్ఘకాల ఎపిలెప్సీతో ఏళ్లతరబడి బాధపడుతుంటారు. మొదడులోని ఒక బాగంలో అవసరానికి మించి విద్యుత్ ఉత్పత్తి అవడం వల్ల ఫిట్స్ వస్తాయి. ఇలా ఉత్పత్తి అయిన విద్యుత్ ఏ భాగం నుంచి ఎక్కడికి వస్తుంది అనేదాన్ని బట్టి రోగికి లక్షణాలు మొద లవుతాయి. మెదడు ఎదుగుదలలో లోపం మరో కారణం. కొంత మందిలో ఒక భాగంలో రెండు నుంచి మూడు మిల్లీ మీటర్లు లేదా సెంటీమీటర్ భాగంలో ఫిట్స్ ఉండొచ్చు. కొన్నిసార్లు మొదడు అర్ధ భాగం లేదా మొత్తం మొదడులో అసాధరణ పరిస్థితి ఉండొచ్చు. పిల్లల్లో వచ్చే నియంత్రించలేని ఫిట్స్ కి ఇదొక కారణం. ఇక పెద్దవారిలో ఫిట్స్ కు కారణం మొదడులోని కణితులు,ఇన్ఫెక్షన్స్ అనగా టిబి , న్యూరో సిస్టిసర్కోసిస్ మొదలగునవి. జన్యుపరమైన కారణాల వల్ల కూడా ఫిట్స్ రావచ్చు. చిన్నప్పుడు జ్వరంతో ఫిట్స్ వస్తాయి వీటిని ఫెబ్రైల్ సీజర్స్ అంటారు ఇవి సాధారణంగా 6 సంవత్సరాల తరువాత ఆగిపోతాయి. ఫిట్స్ లో రకాలు:..ఎవరైనా కాళ్లు, చేతులు కొట్టుకుంటూ కిందపడిపోతేనే వారు ఫిట్స్ తో బాధపడుతున్నారని అనుకుంటాం. ఇలా అందరికీ జరగదు. ఫిట్స్ లక్షణాలు భిన్నంగా కూడా ఉంటాయి..కాంప్లెక్స్ పర్టియల్ సీజర్స్ ఉన్నట్లుండి చేస్తున్న పని ఆపి 20 నుంచి 30 సెకన్లు బొమ్మాలా ఉంటారు. ఈ సమయంలో వీరిని పలకరించినా మాట్లాడరు. ఏమైందని అడిగితే నాకేమైందని ఎదురు ప్రశ్న వేస్తారు, వారికి ఏమీ గుర్తుండదు. ఆ సమయంలో వీరు చేతులు నలపడం, మింగినట్లు



చేయడం, మూతి చప్పరించడం చేస్తుంటారు. చూసే వారికి ఎందుకిలా చేస్తుంటారు అని అనుకుంటారు. కానీ ఫిట్స్ అని తెలుసు కోలేరు. ఇలా అస్తమానం చేస్తుంటే ఫిట్స్ అని గుర్తించాలి. ఈ తరహా ఫిట్స్ ని కాంప్లెక్స్ పర్టియల్ సీజర్స్ అంటారు, ఇలా ఉన్నవారు వెంటనే డాక్టర్ ను సంప్రదించాలి. ఆబ్సెన్స్ ఫిట్స్:..చేస్తున్న పనిని ఆపేసి తదేకంగా చూస్తూ ఉండిపోవడం. నాలుగేళ్ల నుంచి 10 ఏళ్ల వయసు పిల్లల్లో ఇది సాధారణం. స్కూల్లో టీచర్ చెబుతుంటే పిల్లలు రాస్తూ ఆకస్మాత్తుగా రాయం ఆపేస్తారు, 10 నుంచి15 సెకన్లు ఆపేసి మళ్లీ రాయడం మొదలు పెడుతారు. ఇలా రోజుకు 20 నుంచి 30 సార్లు ఒక్కోసారి వందసార్లు కూడా అవుతుంది. ఈ రకం ఫిట్స్ మందులతో బాగా తగ్గుతుంది. టెంపరల్ లోబో ఎపిలెప్సీ ఈ జబ్బు మందులతో తగ్గే అవకాశం తక్కువ. ఉన్నట్టుండి ఉలికిపడతారు. చేతుల్లో వస్తువులు పడేస్తారు. ఫిట్స్ వ్యాధిని నిర్ధారించడం ఎలా,?ఫిట్స్ వచ్చిన వారికి చాలా మంది ఇఇజి పరీక్ష చేస్తారు. ఇఇజిలో తల పై వైర్లు పెట్టి కంప్యూటర్ ద్వారా రికార్డ్ చేస్తారు. అసాధారణ విద్యుత్ శక్తి ఏ భాగం నుంచి వస్తుందో కనుక్కుంటారు. మొదడు స్కానింగ్....ఎంఆర్ఐ (మాగ్నటిక్ రెసినెన్స్ ఇమేజింగ్)స్కాన్ఎపిలెప్సీప్రోటో కాల్. వంద మంది ఫిట్స్ రోగులకు మందులతో చికిత్స చేస్తే 60 మందికి తగ్గుతుంది. అంటే మందులతో ఫిట్స్ నియంత్రణలో ఉంటుంది. చాలా మందికి ఫిట్స్ మూడేళ్లు, ఐదేళ్లు మందులు వాడితే ఇక తగ్గిపోతుంది అనే అపోహతో ఉంటారు. వందలో 10 నుంచి 15 శాతం రోగుల్లో ఐదారేళ్లు మందులు వాడితే తగ్గించి ఆపేసే అవకాశముంటుంది. మిగతా వారు జీవితాంతం మందులు వాడాల్సిందే. మందులు వాడటం ఫిట్స్ నుంచి రక్షణ కోసమని గుర్తించాలి. బయట రోడ్డు మీద నడుస్తునప్పుడు, వంట చేస్తునప్పుడు, ఇతర ప్రదేశాల్లో పని ప్రాంతాల్లో ఫిట్స్ వచ్చినప్పుడు కలిగే ప్రమాదాన్ని నివారించడం, ఫిట్స్ తీవ్రతను తగ్గించడం మందుల ముఖ్య ఉద్దేశ్యం. ఐదేళ్లతర్వాత ఫిట్స్‌కంట్రోల్లో ఉంటే మందుల మోతాదును తగ్గిస్తారు. ఎపిలెప్సి సర్జరీ..మందుల వల్ల తగ్గని ఫీట్స్ వ్యాధికి ఆపరేషన్ చేస్తారు. ఈ సర్జరీ 30 ఏళ్ల క్రితమే మొదలైంది. ఈ సర్జరీకి టీం వర్క్ చాలా కీలకం. న్యూరాలజిస్ట్, న్యూరో సర్జన్, ఎంఆర్ఐ నిపుణులు, న్యూక్లియర్ మెడిసిన్ నిపుణులుంటారు. సర్జరీ రకాలు. 80శాతం కేసుల్లో టెంపరల్ లోబో ఎపిలెప్సీ చేస్తారు. వీరిలో మంచి ఫలితాలు ఉంటాయి. ఉద్యోగాలు చేసుకోవచ్చు. పెళ్లిళ్లు చేసుకోవచచు. లీజనెక్టమీ... బ్రెయిన్లో ఎక్కడా తేడా ఉంది తెలుసుకొని కార్టికల్ స్టిమ్యులేషన్ చేసి తీసేస్తారు. హెమిస్ఫరెక్టమీ:..చిన్నప్పటి నుంచి కాళ్లు చేతులు బలహీనంగా ఉండి, ఫిట్స్ వస్తుంటే ఈ ఆపరేషన్ చేస్తారు.

# యువతకు ఆదర్శంగా డాక్టర్ ఆర్ఎస్ఎస్ ప్రస్థానం

**రైతులు, యువత, సమాజాభివృద్ధి అనే మూడు మార్గదర్శక సూత్రాలతో ముందుకు సాగుతున్న డా.ఆర్ఎస్ ఎస్ ప్రయాణం, వ్యవసాయ విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తూ, వ్యవసాయం చేసే రైతులకు అండగా మారింది. వ్యవసాయ, సామాజిక రంగాల్లో ఆయన చేస్తున్న విశేషమైన కృషికి రైతుల నుంచే హృదయపూర్వక అభినందనలు వెల్లువెత్తుతున్నాయి**





**గార్లదిన్నె జనవరి 8 మనంన్యూస్:** **రైతుల అభివృద్ధికి నిరంతర కృషి...** భారత ఆర్థిక వ్యవస్థరు వెన్నెముక అయిన వ్యవసాయం, నేటి కాలంలో అధిక పెట్టుబడులు, తక్కువ ఆదాయం, నేల నిస్సారత వంటి సమస్యలను ఎదుర్కొంటోంది. ఈ సవాళ్లను అధిగమించి రైతులకు ఉత్తమ మార్గదర్శకత్వాన్ని అందించేందుకు రామి శెట్టి శివ శంకర్ నిరంతర కృషిచేస్తున్నాడు.

**కుటుంబ నేపథ్యం...** తండ్రి రామిశెట్టి వీరభద్రయ్య రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్, తల్లి రామిశెట్టి రమణమ్మ ఇంటి పని వీరు కడప జిల్లాలోని పులివెందులలో జీవనం సాగిస్తున్నారు.

**నిరుత్సాహానికి తలవంచని విద్యాభ్యాస సంకల్పం...** రామ్ శెట్టి శివశంకర్ పులివెందుల పట్టణంలో ప్రాథమిక విద్యను పూర్తి చేసి, తదనంతరం లయోలా కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. 2007లో సబ్ ఇన్స్పెక్టర్ పరీక్షలకు సిద్ధమై పరీక్ష రాసినా, కేవలం 0.25 మార్కుల తేడాతో అర్హత సాధించలేకపోయారు. అయినప్పటికీ నిరుత్సాహపడ కుండా, 2008లో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో ఎంఎస్సీ జియాలజీ పూర్తి చేశారు. 2010లో అనిమల్ సైకాలజీ విభాగంలో పీహెచ్‌డీ పరిశోధన ప్రారంభించి, 2011లో యూజీసీ ప్రాజెక్ట్‌గా "రెడ్ గ్రేప్ ఫ్రూట్"





అంశంపై పరిశోధనలు చేపట్టారు. 2012లో యూజీసీ ప్రాజెక్ట్ పూర్తయ్యి, 2014లో శ్రీ వెంకటేశ్వర యూని వర్సిటీ నుండి పీహెచ్‌డీ పట్టాను పొందారు. 2015లో ప్లాంట్ సైకాలజీ మరియు అనిమల్ సైకాలజీ అంశాలపై విస్తృత పరిశోధనలు నిర్వహించి, సుమారు 40 జాతీయ మరియు అంతర్జాతీయ జర్నల్స్‌లో పరిశోధన పత్రాలు ప్రచురించారు. 2018లో చీనిపంటి పై పరిశోధన కార్యక్రమాలు చేపట్టారు. 2025లో దేశంలోనే తొలిసారిగా దేశీ గోవుల గోమూత్రంతో 'సూర్యపుత్ర' అనే పిచికారీ మందును అభివృద్ధి చేశారు. 2018 నుండి 2026 వరకు రైతులకు సూచనలు, సలహాలు అందిస్తూ వస్తున్నారు.

**గ్రామం గ్రామం తిరుగుతూ రైతులకు మార్గనిర్దేశం...** రైతుల సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయ విద్యను అభ్య



సించిన రామిశెట్టి శివ శంకర్ ప్రతి గ్రామం తిరుగుతూ రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు.. పొలాల్లోనే పంటలను పరిశీలించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, తక్షణ పరిష్కార సూచనలు అందిస్తు..పంటలకు వచ్చే తెగుళ్లు, మట్టి స్వభావం, ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తూ, శాస్త్రీయ వ్యవసాయ విధానాల వైపు దారితీస్తున్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కార్యక్రమాలు కూడా చేపడుతూ వస్తున్నారు.

**డాక్టర్ ఆర్ యస్ యస్ రీసెర్చ్ యూట్యూబ్ ఛానల్ ద్వారా సూచనలు....** నేటి వ్యవసాయంలో అధికంగా





పురుగుమందులు పడుతూ వస్తున్నారు. అయితే ఫర్టిలైజర్ దుకాణ యజమానులు ఎటువంటి అవగాహన లేకుండా రైతులకు ఎరువులు ఇవ్వడంతో రైతులు లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉండటం గ్రహించి రైతులు నష్టపోకుండా ఉండాలన్నదే తన ఏకైక లక్ష్యంగా పెట్టుకుని యూట్యూబ్ ద్వారా ఏ రోగానికి ఏ మందు పిచికారిచేయాలిఎటువంటిజాగ్రత్తలు తీసుకోవాలి భూము లు ఎలా సారం పెంచాలి అని రైతులకు తెలియ జేస్తూ... ఎరువులవినియోగంలోశాస్త్రీయ పద్ధతులను పాటించాలని ఆయన యూట్యూబ్ ద్వారా రైతులకు వివరిస్తున్నారు.

దేశీ గోమూత్రంతో 'సూర్యపుత్ర' ద్రవణం దేశంలోనే **తొలి వినూత్న పరిశోధన...** దేశంలోనే తొలిసారిగా దేశీ గోవులగోమూత్రంతో 'సూర్యపుత్ర' అనే సహజ ద్రవణాన్ని అభివృద్ధి చేశారు. ఈ ద్రవణంపై విస్తృత స్థాయిలో పరిశోధనలు చేపట్టి, శాస్త్రీయ పద్ధతుల్లో తయారు చేసినట్లు తెలిపారు. పూర్తిగా సహజ విధానాల్లో, ఎలాంటి రసాయనాల వినియోగం లేకుండా ఈ ద్రవణాన్ని రూపొందించారు. ఇందుకోసం తన సొంతంగా దేశీ గోవు లనుపెంచుతూ,గోమూత్రాన్నిశుద్ధి చేసి దేశీ గోమూత్రంతో పాటు కలబంద, కుంకుడుకాయ, శీకాకాయ, ఉసిరి, వేప, జామాయిల్ వంటి ఏడు రకాల ఔషధ తో వినూత్న ఉత్పత్తినిఅభివృద్ధిచేశారు. ఈద్రవణంపంటల ఎదుగుదలకు దోహదపడటంతో పాటు తెగుళ్ల నియంత్రణలో కూడా



ప్రభావవంతంగా పనిచేస్తుందని, తక్కువ ఖర్చుతో రైతులకు లాభదాయకంగా ఉండేలాగా తయారు చేశారు.

**రైతు మేలు కోసం సిట్రస్ ప్రోటోకాల్ పుస్తకం...** 2025లో రైతుల మేలు కోసం సిట్రస్ పంటలపై ప్రత్యే కంగా "సిట్రస్" అనే పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకం ప్రస్తుతంమార్కెట్‌లో అందుబాటులో ఉండి, రైతుల నుంచి మంచి స్పందన పొందుతోంది. ఇందులో సిట్రస్ పంటల సాగులో పాటించాల్సిన అడుగడుగునా ప్రోటోకాల్, సాగు పద్ధతులు, పోషక నిర్వహణ, రోగ నివారణ వంటి అంశాలను రైతులకు సులభంగా అర్ధమయ్యే రీతిలో వివరించారు. ఈ పుస్తకం సిట్రస్ సాగు చేసే రైతులకు ఒక



మార్గదర్శక గ్రంథంగా ఉపయోగపడుతోంది.

**చిన్న, పేద రైతుల మేలు కోసం అండగా...** చిన్న మరియు పేద రైతుల సమస్యలను దగ్గర నుంచి తెలుసు కుని, వారికి అవసరమైన శాస్త్రీయ అవగాహన, సాగు సలహాలు,ప్రోటోకాల్స్‌నుఎలాంటిఖర్చులేకుండా అందిస్తూ అండగా నిలుస్తున్నారు. రైతులు నష్టాల్లో కాకుండా లాభాల దిశగా సాగేందుకు మార్గనిర్దేశం చేస్తూ, వారి జీవనోపాధి మెరుగుదలకు నిరంతరం కృషి చేస్తున్నారు.



**నిత్యం పొలాల్లోనే జీవిస్తూ సాగించిన పరిశోధనలు...** రెండు సంవత్సరాల పాటు రాత్రి పగలు గుడిసె వేసుకునినిత్యంపొలాల్లోనేకఠిన పరిశోధనలు నిర్వ హిస్తూ,పాములుతేళ్లువంటిప్రమాదాలను సైతం లెక్కచేయ కుండా రైతుల మేలు కోసం నిరంతరం శ్రమించారు.

**ఆచరణే ఆయుధం: వేలాదిమందికి స్ఫూర్తిగా డా.ఆర్ఎస్ఎస్...** రైతులు, యువత, సమాజ అభివృద్ధి అనే త్రిసూత్రాన్ని ఆలోచనగా కాకుండా ఆచరణగా మలుచుకుని ముందుకు సాగుతున్న , డా. ఆర్ఎస్ఎస్ తన కృషితో ఎందరో మందికి దారి చూపే మార్గదర్శిగా నిలిచాడు. మాటలకన్నా పనితోనే తన స్థాయిని నిరూపిస్తూ, వేలాదిమందికి స్ఫూర్తిగా మారాడు. ఈ ప్రేరణాత్మక ప్రయాణం మరెన్నో జీవితాలకు వెలుగునిచ్చే దీపంలా కొనసాగాలని ఆకాంక్షిద్దాం.



## నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు

గమనించాలని, ఎవరు అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్ కు రాకూడదని తెలిపారు. కాన్ఫరెన్స్ నేపథ్యంలో జిల్లా, డివిజన్, మండల స్థాయిలో పిజిఆర్ఎస్ రద్దు చేయడం జరిగిందని తెలిపారు. సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి రోజంతా విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మంత్రులు, సెక్రెటరీల కాన్ఫరెన్స్ జరుగుతుందని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్ లో జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, హెచ్‌ఓడిలు అందరూ కలెక్టరేట్లో హాజరవుతా రని, డివిజన్ స్థాయిలో ఆర్డీవోల ఆధ్వర్యంలో డిఎల్డిఓ, డిఎల్పిఓ, ఇతర డివిజన్ స్థాయి అధికారులు ఆర్డీవో కార్యాలయం నుంచి హాజరు కావాలన్నారు. అదేవిధంగా మండల స్థాయి,మున్సిపాలిటీలలోసంబంధిత తహసి ల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అందరు మండల స్థాయి అధికారులు ఎంపీడీవో, తహసిల్దార్ కార్యాలయాల్లో ఏదో ఒకచోట అందరూ హాజరు కావాలని తెలిపారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డులలో కూడా సంబంధిత సచివాలయ సిబ్బంది ఫిజికల్ గా సంబంధిత సచివాలయంలోనే ఈ కాన్ఫరెన్స్ లో పాల్గొనాలన్నారు. అందరు అధికారులు కూడా ఖచ్చితంగా వర్చువల్ విధానంలో ఈ కాన్ఫరెన్స్ లో హాజరు కావాలని పేర్కొన్నారు.

## నీలకంఠాపురంలో సంచరించుకున్న ఆధ్యాత్మిక శోభ



డాక్టర్ రఘువీరారెడ్డి దంపతులు శ్రీమతి సునితరఘువీర్ లు కలసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంబిశీచారు. అశేష భక్తుల కోలాహలం మధ్యగరికపాటి వారి నీలకంఠాష్టకం అంశంపట్ల ప్రవచనాన్ని వినడానికి నీలకంఠాపురం గ్రామ ప్రజలే కాకుండా, చుట్టుపక్కల గ్రామాల నుండి సుదూర ప్రాంతాల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దేవాలయ ప్రాంగణమంతా భక్తుల రాకతో కిక్కిరిసిపోయింది. భక్తులందరూ గరికపాటి వారి అమృత వాక్కులనుశ్రద్ధగావింటూ ఆధ్యాత్మిక పరవశంలో మునిగిపోయారు.



## హేమావతి శ్రీ హెంజేరు సిద్దేశ్వర స్వామికి మాఘ మాస ప్రత్యేక పూజలు

– దేవాలయం ప్రధాన అర్చకులు సిద్దలింగేశ్వర స్వామి



**అమరాపురం, ఫిబ్రవరి 08,మనంన్యూస్:** అతి పురాతన కాలంనాటి, నొళంబరాజులు పాలించిన, ప్రసిద్ధి గాంచిన శైవ క్షేత్రమైన హేమావతి శ్రీ హెంజేరు సిద్దేశ్వర స్వామి వారికి మాఘ మాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు దేవాలయం ప్రధాన అర్చకులు సిద్దలింగేశ్వర స్వామి తెలిపారు. ఉదయం రుద్రాభిషేకం, పంచామృ తాభిషేకం, కుంకుమఅర్చనలు జరిపి,వివిధ పూలు, పూలమాలలతో ప్రత్యేక అలంకరణ చేసి, నైవేద్యం సమర్పించి మహమంగళ హారతినిచ్చి, తీర్థప్రసాదంవితరణ చేసారు. ఈ కార్యక్రమంలో ఈ ప్రాంత వాసులే కాక కర్నాటక, ఉమ్మడి అనంతపురము జిల్లాలకు చెందిన వివిధ ప్రాంతాలనించి భారీ సంఖ్యలో భక్తులు, యాత్రికులు పాల్గొన్నారు. ఇదే నెల 15న ఆదివారం మహా శివరాత్రి పండుగను పురష్కరించుకుని శ్రీ సిద్దేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నందున దేవాలయం అర్చకులు, దేవాదాయ శాఖ అధికారులు, చైర్మన్ కె. కరేగౌడ్ తదితరులు కార్యక్రమాల ఏర్పాట్లలో నిమగ్నులైనారు.

## ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థిక సహాయం..



**ధర్మవరం అర్బన్ ఫిబ్రవరి 8 మనంన్యూస్** : పట్టణంలోని శాంతినగర్ లో ఉన్న వేల్పుల జాహ్నవి తన చదువులో ఉత్తమ ప్రతిభ ఘనపరిచి ఎంబిబిఎస్ తృతీయ సంవత్సరం చదువుతోంది. ఈ అమ్మాయి ప్రతిభను దృష్టిలో ఉంచుకొని తొగట వీర క్షత్రియ కళ్యాణ మండపం కమిటీ ఆధ్వర్యంలో ఆ విద్యార్థినికి 80,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని కమిటీ వారికి కృతజ్ఞతలను తెలియజేశారు. అనంతరం అధ్యక్షులు బండారు ఆదినారాయణ, ఉపాధ్యక్షులు దాసరి వెంకటేశులు (చిట్టి) మాట్లాడుతూ తొగట వీర క్షత్రియ సంఘం తరపున ఎన్నో రకాల సేవలను చేస్తున్నామని, ఇందులో వేల్పుల జాహ్నవి చదువులో మంచి ప్రతిభ కనబరిచి డాక్టర్ కోర్స్ చదువుతున్నందున, ఆ అమ్మాయిని ప్రోత్సహించేందుకే ఈ నగదును అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పుట్లూరు రాజు, కోశాధికారి మద్దననరసింహులు, మాజీ అధ్యక్షులు మేకల అశ్వత్ నారాయణ, డైరెక్టర్ పుట్లూరు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపిటిఎఫ్ రాష్ట్ర కమిటీలలో జిల్లాకు అవకాశం

**ధర్మవరం అర్బన్ ఫిబ్రవరి 8 మనం న్యూస్** : విజయవాడలో ఫిబ్రవరి 7, 8 తేదీలలో జరిగిన ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఇందులో భాగంగా శ్రీ సత్య జిల్లా నుండి రాష్ట్ర కమిటీ లో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కోనంకి అశోక్ కుమార్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బికే ముత్యాలప్ప ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. శ్రీ సత్య సాయి జిల్లా నుండి రాష్ట్ర కమిటీలో ఇద్దరికీ అవకాశం కల్పించడం పట్ల రాష్ట్ర సంఘానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని జిల్లా శాఖ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు కోడూరుశ్రీనివాసులు,ఆర్‌చంద్ర, జిల్లా గౌరవ అధ్యక్షులు త్రిమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు బలరామ్, రవీంద్ర రెడ్డి, జల్లా కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్ వాసుకుమార్,రవికుమార్, ధర్మవరం మండల పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివానంద, ఈశ్వరయ్య, గోపి, అంజి, దుర్గాప్రసాద్,రామక్రిష్ణ,రామాంజనేయులు, హరి, గోపాల, శేషు, రాఘవేంద్ర, కుల్లాయిరెడ్డి, చంద్ర,రఫీ, నాగేంద్ర, షబ్బీర్ తదితరులుహర్షం వ్యక్తం చేసారు.





# శ్రీశైలం పాదయాత్రకు వెళ్తున్న భక్తులకు కీలక సూచనలు

– పాటించండి– ఇదే నెల 08నుంచి 15 వరకు అడవి మార్గం గుండా పాదయాత్రకు అనుమతి



**మడకశిర, ఫిబ్రవరి 07,మనంన్యూస్:** మహా శివరాత్రి వేడుకలు పురస్కరించుకుని శ్రీ శైల భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారి దర్శన కోసం పాదయాత్రకు వెళ్తున్న భక్తులకు దేవస్థానముల కమిటీ సూచనలు ఇవ్వడం జరిగింది.మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం పాదయాత్ర వెళ్ళే భక్తులకు ఫిబ్రవరి నెల 8 నుండి 15 వరకు అడవి మార్గం గుండా వెళ్లడానికి అటవీశాఖ వారు అనుమతులను మంజూరు చేయడశీ జరిగింది. భక్తులు ఈ విషయాన్ని గమనించి అందుకు తగ్గట్టుగా మీ ప్రయాణాన్ని ఏర్పాటు చేసుకుని మీ



పాదయాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకునీ ఆ శివయ్య ఆశీస్సులను అందుకోగలరని "మనం" కోరుకుంటూ... ఈ పాదయాత్ర సందర్భంగా మీరు గుర్తుంచుకోవాల్సిన కీలక విషయాలను తెలుసుకోండి. ప్లాస్టిక్ వస్తువులు అడవి మార్గంలో నిషేధం, సిగరెట్, పాన్,గుట్కా, తంబాకు, మద్యపానం లాంటివి పూర్తిగా నిషేదించడం జరిగింది. ఈ పాదయాత్ర ఆత్మకూరు దగ్గర ఉన్నటువంటి వెంకటాపురం నుండి మొదలవుతుంది. కావున భక్తులు తమ వాహనాలను ఆత్మకూరు దగ్గర ఉన్నటువంటి చెక్పోస్ట్ వరకు తీసుకువెళ్లి అక్కడనుండి కాలినడకన బయలుదేర వలసి ఉంటుంది. అటవీ మార్గంలో నడుస్తున్నప్పుడు మీకు అవసరమైన మందులు ( అనగా ఒళ్ళునొప్పులకు , కీళ్ల నొప్పులకు , తలనొప్పి , కాళ్ళు బెనకటం) మీతో పాటుగా తీసుకు వెళ్ళగలరు. దారినడకలో ఫోన్ సిగ్నల్ ఉండదు. అందుకు తగ్గట్టుగా మీరు సిద్ధంగా ఉండగలరు. డిజిటల్ పేమెంట్స్ పనిచేయవు. కావున తగినంత చిల్లర ( 20, 50, 100 నోట్లు ) మీతో తీసుకువెళ్ళండి. కాలినడక దారిలో మధ్యలో అన్నప్రసాద వితరణ జరుగుతుంది ( పూర్తి వివరాలకు కింద జతచేయబడిన ఫోటో చూడగలరు ). దప్పిక ఎక్కువగా ఉంటుంది. కావున తగినన్ని నీళ్లు మీ వెంట తీసుకెళ్లండి. మధ్యలో నీళ్లు అమ్ముతుంటారు. మీ బాటిల్స్ లో వాటిని నింపుకోవచ్చు. వైద్య సౌకర్యాలు నియమించబడిన ప్రదేశాలలో అందుబాటులో ఉంటాయి. ఇవి పూర్తిగా ఉచితం. మీరు వేర్వేరు భూభాగాల ( కొండలు , లోయలు ) గుండా నడుస్తారు.



ఇందుకు మీ శరీరం మీకు పూర్తిగా మద్దతు ఇవ్వాలి. అలా నడవలేని వారు దయచేసి ప్రయత్నించకండి. టాయిలెట్లు నిర్దేశించబడిన ప్రదేశాలలో అందుబాటులో ఉంటాయి. గమనించగలరు. విశ్రాంతి కోసం పెద్ద చెరువు దగ్గర ఆగాల్సి ఉంటుంది. అక్కడ పట్టలు బాడుగకు దొరుకుతాయి. వాటిమీద నిద్రించాల్సి ఉంటుంది. మీరు శ్రీశైలం వరకు నడిచి వెళ్ళాటానికి , మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోండి. ఈ ప్రయాణంలో మీవెంట ఆ శివయ్య ఉంటాడని మరచిపోకండి. ఆయన ఆశీస్సులు మనపైన ఎప్పుడూ ఉంటాయి. ఓం నమః శివాయ హర హర మహదేవ్...

**సమాచార సేకరణ:**
**కె. సిద్దేశ్ కుమార్ సీనియర్ జర్నలిస్ట్**



## గుడిబండ సర్పంచ్ జిబి కరుణాకర్ గౌడ్ వైసిపికి గుడ్ బై చెప్పడానికి రంగం సిద్ధం

– పార్టీ అంతర్గత కలహాలే కారణం అంటున్న అనుచర వర్గం

**మడకశిర, ఫిబ్రవరి 08,మనంన్యూస్:** మేజర్ గ్రామ పంచాయతీ అయిన గుడిబండ సర్పంచ్ జిబి కరుణాకర్ గౌడ్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెల్సింది. ప్రస్తుత పరిస్థితులలో రాజకీయ విలువలు రోజు రోజుకు దిగజారిపోవడం,వైసిపిలో అంతర్గత కలహాలు మధ్య పార్టీని నమ్ముకున్న క్షేత్ర స్థాయి జగనన్న సైనికులకు సరైన న్యాయం జరగక పోవడం తదితర ఎన్నో సమస్యలతో తమను నమ్ముకున్న వారికి ఏ మాత్రం న్యాయం చేయలేక పోవడంతో సర్పంచ్ తీవ్ర ఆవేదనకు గురైనట్లు తన అనుచరుల ద్వారా తెల్సింది. ప్రజాసేవకు అంకితం కావాలన్న ధ్యేయంతో తన విఆర్ఓ పదవికి కూడా రాజీనామా చేసి రాజకీయ రంగప్రవేశం చేసిన కరుణాకర్ గౌడ్ తొలిసారిగానే గుడిబండ సర్పంచ్ గా ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే. వైసిపి హయాంలో సర్పంచ్ గా గెలిచిన అతను గుడిబండ పంచాయతీ అభివృద్ధికి తన వంతు బాధ్యతగా ఎంతగానో పాటుపడిన అయన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనుకున్న రీతిలో పంచాయతీ అభివృద్ధికి అవకాశం లేక పోవడం, తాను నమ్ముకున్న వైసిపి లో కూడా కార్యకర్తలకు, ప్రజలకు సరైన రీతిలో న్యాయశీ చేయలేక పోతున్నాని, తన ఆశయాలకు భిన్నంగా ప్రస్తుత పరిస్థితులు నెలకొనడంతో ఇక రాజకీయాల్లో కొనసాగాలేనని భావించి ఇక నుంచి పూర్తి స్థాయిలో రాజకీయాల నుంచి దూరంగా ఉండాలని ఓ గట్టి నిర్ణయం తీసుకుని సర్పంచ్ కరుణాకర్ గౌడ్ వైసిపికి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. ఇది తన స్వంత నిర్ణయమని, తాను ఇతర ఏ రాజకీయ పార్టీల్లోకి వెళ్లే ఆలోచన ఏ



మాత్రం లేదని అయన తన అనుచరులతో తేల్చి చెప్పినట్లు సమాచారం. మేజర్ గ్రామ పంచాయతీ గుడిబండ సర్పంచ్ కరుణకర్ గౌడ్ వైసిపికి గుడ్ బై చెప్పడానికి సిద్ధం కావడం చర్చనియాంశంగా మారిన నేపథ్యంలో మడకశిర నియోజకవర్గం వై ఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏ విదంగా స్పందిస్తారన్నది వేచి చూడాల్సిందే.

# అసాంఘిక కార్యకలాపాలు నిర్మూలనకు గట్టి చర్యలు

▪ కర్నాటక సరిహద్దు ప్రాంతంలో డ్రోన్ ద్వారా పరిశీలన ▪ అర్బన్ సీఐ సుబ్రహ్మణ్యం



**మడకశిర,ఫిబ్రవరి 08,మనంన్యూస్:** మడకశిర అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు నిర్మూలనకు గట్టి చర్యలు చేపట్టినట్లు మడకశిర అర్బన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పేకాట, మట్కా తదితరజూదాలతో పాటు కర్నాటక మద్యం అక్రమ రవాణా, అమ్మకాలు, ఇసుక మాపియా తదితర అసాంఘిక కార్యక్రమాలు నిర్మూలనలో భాగంగా ఆదివారం మండలంలోని జమ్మానిపల్లి గ్రామం పరిసర ప్రాంతం కర్ణాటక సరిహద్దులో డ్రోన్ కెమెరాద్వారాక్షుణ్ణంగాపరిశీలించడం జరిగింద న్నారు. మడకశిర మండలం, గౌడనహల్లి పంచాయితీకి చెందిన జమ్మానిపల్లి గ్రామం కర్ణాటక సరిహద్దుకు రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్నందున ఆంధ్రప్రదేశ్ కుటమి ప్రభుత్వం ఎంతగానో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గంజాయి సరఫరా, పేకాట తదితర అసాంఘిక శక్తులను గుర్తించి అరికట్టడంలో భాగంగా జిల్లా ఎస్ పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాలమేరకు,పెనుకొండ డిఎస్పీ యు. నరసింగప్పఆధ్వర్యంలో గ్రామాల్లో శాంతి భద్రతల దృష్ట్యా డ్రోన్ కెమెరాల ద్వారా కర్ణాటక సరిహద్దు ప్రాంతం అయిన దొమ్మితి మరి,వెంకటాపురం పరిసర ప్రాంతాలను పరిశీలిం చినట్లు సీఐ తెలిపారు. మడకశిర మండలంలోని కర్నాటకసరిహద్దులతోపాటు,మండలంలో ఎక్కడైనా, ఎవరైనా సరే అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతుంటే వెంటనే పక్కగా సమాచారం ఇవ్వాల్సిందిగా అర్బన్ సీఐ సుబ్రహ్మణ్యం కోరారు. ఈ కార్యక్రమంలో తమ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలు ఇస్తాం



- గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు వలనే ఇళ్ల నిర్మాణం ఆలస్యమవుతోంది
- ఇళ్ల పట్టాల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత
- బుక్కచెర్ల గ్రామానికి చెందిన వారికి ఇళ్ల పట్టాలు అందజేసిన ఎమ్మెల్యే

**రాప్తాడు,ఫిబ్రవరి 8, మనం న్యూస్:** అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా ఇళ్ల పట్టాలు అందజేస్తామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు మండలం బుక్కచర్ల గ్రామానికి చెందిన వారికి ఆమె అనంతపురంలోని తన క్యాంపుకార్యాలయంలో ఇళ్ల పట్టాలు అందజేశారు. మొత్తం 8మంది నిరుపేదలకి ఒక్కొక్కరికి 2సెంట్లు ప్రకారం ఇంటి స్థలాలు కేటాయించి... పట్టాలు పంపిణీ చేశారు. లబ్ధిదారులు ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు వలనే ఇళ్ల పట్టాల పంపిణీ, ఇళ్ల నిర్మాణం ఆలస్యమవుతోందని అన్నారు. ఇప్పటికే గ్రామాల వారిగా ఇళ్ల పట్టాలు అందజేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. త్వరలోనే పట్టాల పంపిణీ, ఇళ్ల నిర్మాణం ప్రారంభమవుతుందన్నారు. కేవలం అర్హత ఉంటే చాలని.. పార్టీలు ఈ ప్రభుత్వం చూడదని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు...



## గుట్టూరు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

– 9మందికి గాయాలు





**పెనుకొండ ఫిబ్రవరి 8 మనంన్యూస్ :** పెనుకొండ మండలంలోని గుట్టూరు సమీపంలోని జాతీయ రహదారిలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో 9మంది గాయపడ్డారు.కీయా ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల మేరకు ఆదివారం ఉదయం హిందూపురం నుంచి దర్మవరం వెళుతున్న ఏపీ 02 టీఈ 3817 నంబరు గల ఆర్టీసీ బస్సు గుట్టూరు సమీపంలో ఏన్ హెచ్ 44 రహదారి పైకి డ్రైవర్ బస్సును క్రాస్ చేస్తుండగా అదేసమయంలో అనంతపురం నుండి బెంగళూరు వైపు వెళ్తున్న కేఏ 01ఏఆర్ 5388 నెంబరు గల లారీ ఎడమవైపు చివరలో ఢీ కొపడంతో బస్సులో ఉన్న 8మందితో పాటు కండక్టర్ చాంద్ భాష గాయపడ్డారన్నారు.గాయపడ్డ క్షతగాత్రులను పెనుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.అందులో ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని తెలియజేశారు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## విద్యుత్ సరఫరాలో వేలాపాల పాటించని విద్యుత్ అధికారులు

**గుడిబండ ఫిబ్రవరి 8 మనంన్యూస్** : మండలంలోని మందలపల్లి విద్యుత్ స సబ్ స్టేషన్ లో ఎస్ రాయపురం ఫీడర్‌కు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయ కపోవడంతో రైతులు బోరు బావుల వద్ద పడిగాపులు కాస్తున్నారు విద్యుత్ శాఖ అధికారులు వేలా పాల పాటించకపోవడంతో విద్యుత్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియకపోవడంతో రైతులు విద్యుత్ సరఫరా కోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారు ఇంటికి వచ్చి పొలం వద్దకు వెళ్లే లోపు విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో విద్యుత్ శాఖ అధికారులపై రైతులు మండిపడు తున్నారు విద్యుత్ సబ్ స్టేషన్లో నెలకొన్న సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు విద్యుత్ ను సక్రమంగా సరఫరా చేయకపోవడంతో రైతులు సాగుచేసిన వివిధ రకాల పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు మందలపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ లో నెలకొన్న సమస్యల్ని విద్యుత్ అధికారులు ఎందుకు పరిష్కరించడం లేదని రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ సరఫరాను సక్రమంగా అందించకపోతే మందలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌కార్యాలయం ముందు రైతులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపడతామన్నారు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి రైతులకు నాణ్యమైన విద్యుత్ ను సరఫరా చేసి రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోకుండా చూడాలనిరైతులు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు.

## బెంగళూరులో సోము నూతన గృహప్రవేశంనకు హాజరు

– వైసిపి రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజు



**మడకశిర, ఫిబ్రవరి 08,మనంన్యూస్:** బెంగళూరులోని గణపతి లే ఔట్‌లో అమరాపురం మండలం, కాచి కుంట గ్రామానికి చెందిన సోము నూతనంగా నిర్మించిన గృహప్రవేశం కార్యక్రమానికి వై ఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హలుకూరు కాంతారాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలో పాల్గొని మహా మంగళ హారతి, తీర్థ ప్రసాదం స్వీకరించారు. సోము కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసారు. తమ ఆహ్వానం మన్నించి గృహప్రవేశంనకు హాజరైన కాంతరాజుకు శాలువా కప్పి, పూల మాల వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం విందు భోజనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కుంచిటిగర సంఘం నాయకులు హలు కూరు సురేష్, అగలి భాస్కర్, పవన్,చిదానంద, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశంనకు హాజరు


– కుంచిటి వక్కలిగా సాధికారత కన్వీనర్ పాండురంగప్ప

**రొళ్ల, ఫిబ్రబరి 08,మనంన్యూస్:** రొళ్లమండలం, మల్లినమడుగు గ్రామంలో శ్రీమతి రత్నమ్మ యంజేరప్ప దంపతులు నూతంగా నిర్మించిన గృహప్రవేశం కార్యక్రమానికి ఆదివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కుంచిటి వక్కలిగా సాధికారత కన్వీనర్ విఎం పాండురంగప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన ప్రత్యేక పూజలో పాల్గొని మహా మంగళ హారతి తీర్థ ప్రసాదం స్వీకరించారు. తమ ఆహ్వానం మన్నించి గృహ ప్రవేశం కార్యక్రమానికి అజరైన కన్వీనర్ పాండుతో పాటు, మడకశిర మండల టిడిపి మాజీ కన్వీనర్ కురుబ రామాంజినేయులకు వారుశాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం వారువిందు భోజనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులుపాల్గొన్నారు.



## ప్రముఖ శుభ వాస్తు పండిత్ ధనుంజయ స్వామి సలహాలతో అంతా మంచిది అయ్యింది

– హైదరాబాద్ కు చెందిన బాధిత కుటుంబ సభ్యులు



**మడకశిర, ఫిబ్రవరి 08,మనంన్యూస్:** మడకశిర పట్టణం సమీపంలోని, పెనుకొండ రోడ్డులో గల భూమనందఆశ్రమం వ్యవస్థాపకులు, ప్రముఖ శుభవాస్తు పండితులు చందక చర్ల ధనుంజయ స్వామి వారి వాస్తు సలహాలు, సూచనలతో తమ కుంటుంబానికి అంతా మంచిదే అవుతున్నదని హైదరాబాద్ కు చెందిన ఓ బాధిత కుటుంబం సోషల్ మీడియా వేదికగావాస్తుపండిత్ ధనుంజయ స్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ స్వామిజీ మేలు గురించి తమ ఆనందం, సంతోషం పంచుకున్నారు. దీన్ని సారాంశం ఇలా ఉంది. తమ అభ్యర్థన మేరకు ధనుంజయ స్వామి వారు హైదరాబాద్ లోని తమ నివాసంనకు వచ్చి తాము నివాసం ఉంటున్న ఇంటి వాస్తు చూసిన తర్వాత స్వామి వారు తమకు అందించిన వాస్తు సలహాలు మేరకు తాము పలు చేర్పులు, మార్పులు చేసుకోవడం జరిగిందన్నారు. ఇలా చేసుకున్న కొద్ది రోజులకే తమకు అంతా మంచి జరిగిందని, తన భార్యకు సంతాన భాగ్యం కలిగిందని, తాము ఏ పనులు చేపట్టిన ఎలాంటి అడ్డు, ఆటంకాలు లేకుండా తమకు అంతా మంచే జరుగుతుందని బాధిత కుటుంబ యజమాని సోషల్ మీడియాలో పంచుకున్న సందేశం ప్రస్తుతం వైరల్ అవుతుందడం విశేషం.

## అక్రమ మట్టి, ఇసుక తవ్వకాలు చేస్తే చర్యలుతప్పవు:ఆర్డీవో



**ధర్మవరం అర్బన్, ఫిబ్రవరి 8 మనంన్యూస్ :** ధర్మవరం డివిజన్ పరిధిలోని కొండలు, గుట్టల నుండి అక్రమంగా మట్టిని రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవనివాహనదారులకు రెవెన్యూ డివిజనల్ అధికారి మహేష్ హెచ్చరిక జారీ చేశారు. ఆదివారం రెవెన్యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మైనింగ్‌శాఖవారిచే తగిన అనుమతులు లేకుండా మట్టి తవ్వకం రవాణా చేయడం చట్టవిరుద్ధమని, ఇటువంటి చర్యలకు పాల్పడితే సంబంధిత వాహనాలను స్వాధీనం చేసుకొని, జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అలాగే అక్రమ రవాణా వాహనాలను కోర్టుకు అప్పగించడం జరుగుతుందని హెచ్చరించారు. అక్రమ మట్టి రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీసు మరియు గనుల శాఖల సమన్వయంతో నిరంతర తనిఖీలు చేపడతామని తెలిపారు. పట్టా భూముల్లో మట్టి లేదా ఇసుకను తవ్వి తరలించడానికి మైనింగ్ శాఖ వారి అనుమతి తప్పనిసరి అని ప్రజలు మరియు వాహనదారులు చట్టాన్ని గౌరవించి ప్రభుత్వ నిబంధనలను పాటించాలని ప్రజలు అక్రమ రవాణా పై సమాచారం అందించాలని సూచించారు.

## కౌన్సిలర్ శ్రీనివాసులు కుమారుడి వివాహంనకు హాజరు

– టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి



**మడకశిర, ఫిబ్రవరి 08,మనంన్యూస్:** మడకశిర పట్టణంలోని పావగడ రోడ్డులో గల శ్రీ చంద్రమౌళేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం జరిగిన శుభ వివాహశీ నకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి మహాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు, ఇరు కుటుంబాల సభ్యులకు అయన శుభాకాంక్షలు తెలియజేసారు. తమ ఆహ్వానం మన్నించి వివాహంనకు హాజరైన శ్రీనివాస్ మూర్తితో పాటు ఇతర నాయకులకు వారు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పిఎ బోయ రవి కుమార్, మాజీ మార్కెట్ యాడ్ చైర్మన్ బోయ ఓబులేష్,ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బద్రి, టిడిపి యూత్స్ బెగర్లపల్లి రవి, క్లస్టర్ ఇంచార్జ్ కంప్యూటర్ ఆపరేటర్ చంద్ర, గోపాల్, వార్డ్ జనరల్ సెక్రెటరీ రామంజి, జవనడుకు రంగస్వామి తదితరులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## నూతన వధువులను ఆశీర్వదించిన రాష్ట్ర కార్యదర్శి



**గుడిబండ ఫిబ్రవరి 8 మనంన్యూస్** : మండలపరిధిలోనిరాళ్లపల్లి గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ రంగనాథ్ కుమార్తె స్పందన వెడ్స్ హరికృష్ణ వివాహం రాళ్లపల్లి సమీపంలోని ఏదు మందిఅక్కమ్మ గారికొండమీదజరిగింది ఈ వివాహానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి హాజరై వధూవరులను ఆశీర్వదించారుకార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణప్ప మాజీ ఎంపిటిసి నజీర్ డీలర్ జైపాల్ మాజీ డీలర్ లోకేష్ బూదిపల్లి జయరాం బాధిపల్లెప్ప వరప్రసాద్ రంగస్వామి పాల్గొన్నారు.

## వివిధ శుభకార్యక్రమాలకు హాజరైన సింగిల్ విండో అధ్యక్షుడు గణేష్



**అమరాపురం, ఫిబ్రవరి 08,మనంన్యూస్:** అమరాపురం మండలంలో ఆదివారం జరిగిన వివిధ శుభ కార్యక్రమాలలో అమరాపురం సింగిల్ విండో అధ్యక్షుడు ఎన్. గణేష్ హాజరయ్యారు. మండల కేంద్రమైన అమరాపురం పట్టణంనకుచెందినతెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు రాఘవేంద్రగుప్తా వారి నూతన జువెలరీ షాపు ప్రారంభోత్సవంలో, అదేవిధంగా బోండ వెలుగోపాల్(వేణు)నూతనంగా నిర్మించిన గృహప్రవేశం కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.మహా మంగళ హారతి తీర్థ ప్రసాదశీ స్వీకరించారు.ఇరు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. తమ ఆహ్వానం మన్నించి తాము చేపట్టిన శుభ కార్యక్రమాల్లో హాజరైన గణేష్ కు వారు శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో భరత్ రాజ్ హార్డ్ వేర్ యజమాని ఎం. భరత్ రాజు, మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు బంగారుపాళ్యం తిప్పేస్వామి, వలస పంచాయతీ టిడిపి కన్వీనర్ నాగరాజు,మాజీ ఎంపీటీసీ రవిప్రకాష్ పాల్గొన్నారు.



## బత్తలపల్లిలో నాస్తిక మేళా కరపత్రం విడుదల



**బత్తలపల్లి. ఫిబ్రవరి 08 మనంన్యూస్** : సత్యసాయి జిల్లా, బత్తలపల్లి నివాసి నాగేశ్వరరావు స్వగృహంలో ఆదివారం నాస్తిక మేళా కరపత్రాన్ని నాయకులు విడుదల చేశారు.వాయిస్ ఆఫ్ చార్వాక సహ సంపాదకులు సత్య నిర్ధారణ అధ్యక్షతన సమావేశం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నాగేశ్వర రావు,విశిష్ట అతిథిగా అల్లబకాష్ లు పాల్గొన్నారు.అలాగే ఓ దినపత్రిక మాజీ సంపాదకులుశర్మ,జనవిజ్ఞానవేదికసభ్యులతోపాటుబౌతికవాదులు పాల్గొంటారు. ఈనెల 14,15 తేదీలో మంగళగిరి మండలం నిడమర్రులో జరుగబోవు ఈ సమావేశానికిరాయలసీమ నుండి ఆసక్తిగల వారందరూపాల్గొనాలని నిర్వాహకులు కోరారు.వివరాలకు9949563440 నెంబర్ను సంప్రదించాలన్నారు.

## కూటమి ప్రభుత్వ అభివృద్ధిని చూసి టీడీపిలోకి 300 కుటుంబాలు చేరిక



**పెనుకొండ ఫిబ్రవరి 8 మనంన్యూస్ :** పెనుకొండ నియోజకవర్గానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు కొండంపల్లి శ్రీరాములు, ఏఐటీయూసీ నాయకులు క్రిష్టప్ప, వెంకటరాముడు, నరసింహమూర్తి, వెంకటేష్, జాఫర్, అల్లా బకాష్, వెంకటలక్ష్మమ్మలతో పాటు మరో 300 కుటుంబాలు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలోకి చేరారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత హాజరయ్యి పార్టీలోకి చేరిన వారందరికీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల్లోనే రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో వేగంగా ముందుకు సాగుతోందన్నారు. ఎన్నడూ లేని విధంగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ప్రతి వర్గాన్ని ఆదుకునే విధంగా ప్రభుత్వంపనిచేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన సభ్యులు మాట్లాడుతూ పెనుకొండ నియోజకవర్గంలో మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి పరుగులు పెడుతున్నాయని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మంత్రి సవితమ్మ సారథ్యంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని,కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా అనుకూల పాలనకు నిదర్శనంగానే వివిధ పార్టీల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములు , మండల కన్వీనర్ దండు ఈశ్వర్ ప్రసాద్, జిల్లా వడ్డెర సంఘం ఉపాధ్యక్షులు వెంకటగిరి పాలెం శ్రీనివాసులు, త్రివేంద్ర,బాబుల్ రెడ్డి, పల్లవ రాజు, వడ్డే యల్లప్ప, నియోజకవర్గ సీనియర్ టిడిపి నాయకులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



## సైన్స్ ప్రయోగాలే శాస్త్రీయ అభివృద్ధికి పునాది

– మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్



**అనంతపురం, ఫిబ్రవరి 8, మనంన్యూస్:** విద్యార్థులు చేసే వినూత్న సైన్స్ ప్రయోగాలే శాస్త్రీయ అభివృద్ధికి పునాది అవుతుందని మాజీ ఎమ్మెల్సీ, జేవీవీ రాష్ట్ర గౌరవ సలహాదారు డాక్టర్ ఎం.గేయానంద్ అన్నారు. జేవీవీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సంగమేష్ నగర్ ఆఫీస్ నందు రాష్ట్రస్థాయి యురేకా సైన్స్ ఎక్స్‌పో–2026 మరియు ఇతర అంశాలపై చర్చ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గేయానంద్ మాట్లాడుతూ ప్రతి ఏటా రాష్ట్రవ్యాప్తంగా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్న అనుభవం మనకు ఉందని, అందులో భాగంగానే విద్యార్థులలో సైన్స్ ప్రతిభా పాటవాలను వెలికి తీయాలనే ఉద్దేశంతో యురేకా సైన్స్ ప్రయోగాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయనతెలిపారు.విద్యార్థులువినూత్నంగా ఆలోచించి సైన్స్ ప్రయోగాలు చేయడం ద్వారా జ్ఞానాన్ని సంపాదించడంతోపాటు కొత్త అంశాలను కనుగొనే అవకాశ ముందన్నారు. నేడు పాఠశాల స్థాయిలో విద్యార్థులు చేసే ఈ ప్రయోగాలే భవిష్యత్తులో వారు రాణించడానికి ఎంతో ఉపయోగపడతాయని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఎటువంటి ఖర్చు లేకుండా లో కాస్ట్–నో కాస్ట్ తో విద్యార్థులు చేసే ప్రయోగాలు వారిలో ప్రత్యేకమైన ఆలోచనలను రేకెత్తిస్తాయని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎం.ఆదిశేషు అన్నారు. ఉన్నత పాఠశాల తరగతులకు చెందిన విద్యార్థులు వ్యక్తిగతంగా కానీ, గ్రూపుగా కానీ ఏర్పడి ప్రయోగం చేసి వాటినివీడియోద్వారా రాష్ట్ర కమిటీకి పంపించాలని కోరారు. ఇందుకు మార్చి 8వివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని, విజ యవంతం కావడానికి కృషి చేయాలని జిల్లాలోని ప్రతి స్కూలు నుండి విద్యార్థులు ఈ యురేకా సైన్స్ ప్రయోగ పోటీలలో పాల్గొనేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం యురేకా సైన్స్ ఎక్స్‌పో పోస్టర్లను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, జేవీవీ జిల్లా అధ్యక్షకార్యదర్శులుకె.పి.చిత్తప్ప, కె.వీరరాజు, కోశాధికారి మహమ్మద్ జిలాన్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసరావు, సమతా నాయకులు కె.నాగరత్న జెవివి నగర అధ్యక్ష కార్యదర్శులుప్రసాద్‌రెడ్డి,తిరుపాల్‌నాయకులు రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, ముత్యాలు, ప్రసాద్, రాఘవేంద్ర, తిప్పేస్వామి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

## జీవితమే అంధకారంగా మారకుండా వెలుగుల నింపడమే లక్ష్యం



**ధర్మవరం అర్బన్ ఫిబ్రవరి 8, మనంన్యూస్ :** అంధకార జీవితంలో ఉన్న పేదల జీవితాల్లో వెలుగు నింపాలన్నదే రోటరీ క్లబ్ లక్ష్యమని క్లబ్ అధ్యక్షుడు నాగభూషణ, కార్యదర్శి విజయభాస్కర్ ,కోశాధికారి నరేందర్ రెడ్డి, క్యాంపు చైర్మన్ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరమును నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ శిబిరం రోటరీ క్లబ్, శంకరా కంటి ఆసుపత్రి బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ శ్రీ సత్యసాయి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందన్నారు. ఇప్పటికే వేల సంఖ్యలో పేద ప్రజలకు కంటి ఆపరేషన్ లతో పాటు కంటి అద్దాలు కూడా పంపిణీ చేయడం మాకెంతో తృప్తితో పాటు సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. నేటి ఈ కార్యక్రమానికి దాతలుగా కీర్తిశేషులు వెంకటప్ప,కీర్తిశేషులుచెన్నమ్మ జ్ఞాపకార్థం రాజేశ్వరి వారు కుటుంబ సభ్యుల దాతృత్వంతో నిర్వహించడం జరిగిందని తెలిపారు. దాతల సహాయ సహకారములతోనే ప్రతినెల ఈ కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా దాతలను ఘనంగా సత్కరిస్తూ వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ శిబిరంలో 93 మంది కంటి రోగులు పాల్గొనగా, శంకర కంటి ఆసుపత్రి డాక్టర్ ప్రేరణ కంటి వైద్య చికిత్సలను అందించినతర్వాత 63 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా రోటరీ క్లబ్ వివిధ రకాల సేవలను కూడా అందిస్తున్నామని వారు తెలిపారు. పేద ప్రజలు ఎక్కడ ఉన్న, అక్కడే రోటరీ క్లబ్ సేవలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటాచలం,రామకృష్ణ,సత్రశాల ప్రసన్నకుమార్, సుదర్శన్ గుప్తా, మనోహర్ గుప్తా, కొండయ్య, పెద్దారెడ్డి, గర్రె రమేష్ బాబు, దాత కుటుంబం తరఫున వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యోగ భద్రత కల్పించాలని మంత్రికి వినతి



**పెనుకొండ ఫిబ్రవరి 8 మనంన్యూస్** : మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలో పని చేస్తున్న అతిథి ఉపాధ్యాయులు మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవితను కలిసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆదివారం వినతి పత్రం ఇచ్చారు.10 సంవత్సరాలుగా సంస్థను నమ్ముకుని అతిథి ఉపాధ్యాయులుగా పని చేస్తున్నామన్నారు. మమ్ము లను గుర్తించి కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా గుర్తించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని మంత్రికి విన్నవించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని, మీకు ఉద్యోగ భద్రత కల్పిస్తామి హామి ఇచ్చినట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవిచంద్ర యాదవ్ తెలిపారు. కార్యక్రమంలోఅతిథి ఉపాధ్యాయులు భార్గవి, స్వాతి,శ్రీవిద్య, అవీలా,అక్కమ్మ, రవి,నాగరాజు,జిత్తానాయక్,రవీంద్ర,రామకృష్ణ,లింగయ్య పాల్గొన్నారు.

## పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**బొమ్మనహాల్ ఫిబ్రవరి 8 మనం న్యూస్** : నేడు అనగా సోమవారం 9 ఫిబ్రవరి 2026 మండలంలోని సింగేపల్లి గ్రామం లో నిర్వహించే పట్టాదారు పుస్తకాల పంపిణీ కార్యక్తమానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని టీడీపీ మండల కన్వీనర్ బలరాం రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హాజరువుతున్నట్టు తెలిపారు. కావున రైతులు,ప్రజలు హాజరు కావాలని కోరారు.

## గోకులం షెడ్ పరిశీలించిన పిడి



**ఆత్మకూరు ఫిబ్రవరి 8 మనంన్యూస్** : మండల కేంద్రం ఆత్మకూరులో ఆదివా రం పిడి షబ్బీర్ అలీ గోకులం షెడ్లను పరి శీలించారులబ్ధిదారుడు వెంకట్ నారాయణ తో షెడ్డు నిర్మాణం బిల్లుల చెల్లింపు గురించి ఆరాధించారు పిడి వెంట ఏపీవో వెంకటరమణ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశు లు బొమ్మయ్య లబ్ధిదారులు ఉన్నారు

## టిడిపి నాయకుడు యంజేరప్ప నూతన గృహప్రవేశంనకు హాజరు

– టిడిపి ప్రజా ప్రతినిధులు పార్టీ శ్రేణులు

**రొళ్ల, ఫిబ్రబరి 08,మనంన్యూస్:** రొళ్ల మండలం, మల్లినమడుగు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీమతి రత్నమ్మ యంజేరప్పదంపతులునూతంగానిర్మించిన గృహప్రవేశం కార్యక్రమానికి ఆదివారం తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ జీకె ఈరన్న, సింగలవిండో అధ్యక్షుడు దాసిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బిఎస్ గురుమూర్తి, ఏపీఐఐసి రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణ, తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలో పాల్గొని మహా మంగళ హారతి తీర్థ ప్రసాదం స్వీకరించారు. యంజేరప్ప కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసారు.తమ ఆహ్వానం మన్నించి గృహ ప్రవేశం కార్యక్రమానికి అజరైన టిడిపి శ్రేణులకు వారు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం వారు విందు భోజనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బ్రతుకు - బ్రతికించు: క్షణికావేశం కాదు... పోరాటమే జీవితం

ఒంటరితనం, ఒత్తిడి, నిరాశ నడుమ నలిగిపోతున్న మనసులు పెరుగుతున్న ఆత్మహత్యలు సమాజానికి హెచ్చరికగా మారుతున్నాయా?



**గార్లదిన్నె జనవరి 8 మనంన్యూస్** : అంతరిక్షంలో అద్భుతాలు సృష్టిస్తున్న ఆధునిక మానవుడు, అంతరంగాన్ని అర్థం చేసుకోవడంలో మాత్రం వెనుకబడిపో తున్నాడు. కృత్రిమ మేధస్సుతో యంత్రాలకు ప్రాణం పోస్తున్న మనం, పక్కనే ఉన్న తోటి మనిషి ఆవేదనను గుర్తించలేకపోతున్నాం. అంకెల్లో అభివృద్ధి కనిపిస్తున్నా ఆత్మహత్యల గణాంకాల్లో మనిషి ఒంటరితనం బయటపడుతోంది. వరుసగా వెలుగులోకి వస్తున్న విషాద ఘటనలు వ్యక్తుల బలహీనత కంటే కూడా, సామాజిక వైఫల్యాన్నే ఎత్తిచూపుతున్నాయి.యంత్రాల మధ్య నలిగిపోతున్న మనిషికార్పొరేట్ ఉద్యోగి నుంచి దినసరి కూలీ వరకు నేడు ప్రతి ఒక్కరూ ఒక అదృశ్య ఒత్తిడి నీడలో బతుకుతున్నారు. డెడ్‌లైన్లు, టార్గెట్లు, అంతులేని పోటీ.. ఈ జీవన పోరాటంలో మనిషి తన ఉనికిని కోల్పోయి ఒక 'నడిచే యంత్రం'గా మారుతున్నాడు. బయట కనిపిస్తున్న భౌతిక విలాసాలు మనసులో గూడుకట్టుకున్న ఆందోళనను కప్పిపుచ్చలేకపోతున్నాయి.ఒకరికి ప్రేమ విఫలమై లోకం చీకటవుతోంది, మరొకరికి పరీక్షల్లో మార్కులు తగ్గితే జీవితమే ముగిసిందనిపిస్తోంది. అప్పుల ఊబి, ఒంటరితనం, ఆత్మాభిమానం దెబ్బతింటుందనే భయం, కారణం ఏదైనా మనిషిని మృత్యువు వైపు నడిపిస్తోంది. ఉద్యోగం, పరీక్ష, వివాహం అనేవి జీవిత ప్రయాణంలో ఎదురయ్యే మజిలీలు మాత్రమే.. అవి జీవితం కాదన్న పరమార్థాన్ని బోధించడంలో మన విద్యా వ్యవస్థ, సమాజం పూర్తిగా విఫలమవుతున్నాయి.గణాంకాల వెనుక దాగిన మృత్యుఘోషనేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదికలు భారతదేశంలో పెరుగుతున్న బలవన్మరణాల తీవ్రతకు అద్దం పడుతున్నాయి. ఇవి కేవలం సంఖ్యలు కావు.. మనం కోల్పోతున్న సజీవ స్వప్నాలు.దేశంలో ఏటా సగటున 1.70 లక్షల మందికి పైగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అంటే రోజుకు 460 మందికి పైగా, గంటకు సుమారు 19 మంది తమ నిండు ప్రాణాలను బలి తీసుకుంటున్నారు. చితిపై యువశక్తి ఆత్మహత్య చేసుకుంటున్న వారిలో 65 శాతం మంది 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు వారే ఉండటం దేశ భవిష్యత్తుకే గొడ్డలిపెట్టు.విద్యార్థుల వేదన ఏటా సుమారు 13,000 మందికి పైగా విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని భరించలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.డిజిటల్ మాయాజాలం పెరుగుతున్న ఒంటరితనంసోషల్ మీడియాలో వేల మంది 'స్నేహితులు', వందల సంఖ్యలో 'లైకులు' ఉండొచ్చు.. కానీ మనసు భారమైనప్పుడు కన్నీరు తుడిచే ఒక్క చేయి కూడా పక్కన లేని స్థితి నేడు కనిపిస్తోంది. ముక్కలవుతున్న ఉమ్మడి కుటుంబాలు, అంతరిస్తున్న ఆత్మీయ పలకరింపులు మనిషిని ఒంటరిని చేస్తున్నాయి. ఇతరుల జీవితాలతో పోల్చుకుంటూ మనల్ని మనం తక్కువ చేసుకోవడ అంతరంగాన్ని దహించివేస్తోంది.మరణం పరిష్కారం కాదు ఆత్మహత్య సమస్యకు ముగింపు కాదు, అది ఆ కుటుంబానికి మిగిల్చే తీరని శోకం. ఎదురుగాలిలో దీపంలా పోరాడి గెలవడమే నిజమైన జీవితం. మన చుట్టూ ఉన్నవారు ఒక్కసారిగా మౌనంలోకి వెళ్లినా, వైరాగ్యంగా మాట్లాడుతున్నా వెంటనే గుర్తించాలి. మీరు ఇచ్చే కొద్దిపాటి సమయం, ఒక చిన్న పలకరింపు, 'నేనున్నాను' అనే భరోసా.. ఒక నిండు ప్రాణాన్ని తిరిగి తీసుకురాగలవు.మార్పు ఎక్కడ మొదలవ్వాలి జీవన పాఠం కావాలి: విద్యాసంస్థలు కేవలం ర్యాంకుల వేటలో విద్యార్థులను యంత్రాలుగా మార్చకూడదు. ఓటమిని హుందాగా స్వీకరించే మనస్తత్వాన్ని నేర్పాలి. పోలికలు వద్దు: పక్కవాడి జీవితాన్ని



మన జీవితాన్ని బేరీజు వేసుకోవద్దు. ప్రతి ఒక్కరి జీవితం ఒకేలా ఉండదు . నీ ఎదుగుదలకు ఒక సమయం ఉంటుందని గుర్తించాలి..మానసిక ఆరోగ్యం : మనసు గాయపడినప్పుడు నిపుణుల సహాయం తీసుకోవడం బలహీనత కాదు, అది విజ్ఞత.కుటుంబం తోడుగా:పిల్లలు కష్టాల్లో ఉన్నప్పుడు ధైర్యంగా తలుపు తట్టగలిగే సాన్నిహిత్యం తల్లిదండ్రులు పెంచుకోవాలి.నీ జీవితం నీ ఒక్కడిదే కాదు.. నిన్ను నమ్ముకున్న ఎందరిదోసమస్యలకు చావే పరిష్కారమైతే ఈ ప్రపంచం ఎప్పుడో శ్మశానంగా మారిపోయేది. ఆత్మహత్య అనేది ఒక క్షణికావేశం మాత్రమే. ఆ ఒక్క నిమిషం పాటు మనసును నియంత్రించుకోగలిగితే.. అద్భుతమైన జీవితం మన ముందు ఉంటుంది. ఓటమిని గెలుపుకు పునాదిగా చేసుకుందాం. బ్రతుకుదాం.. తోటివారిని బ్రతికిద్దాం

**జి. అజయ్ కుమార్**



# మహా సహస్రావదాని శ్రీ గరికిపాటికి ఘన స్వాగతం

- వెండి పల్లకిలో భారీఎత్తున ఊరేగింపు మహోత్సవం
- ఘనంగా సత్కరించిన దేవస్థానముల కమిటీ చైర్మన్ రఘువీరారెడ్డి దంపతులు





**మడకశిర, ఫిబ్రవరి 08,మనంన్యూస్:** ఆధ్యాత్మిక కేంద్రంగా దినదిన అభివృద్ధి చెందుతున్న నీలకంఠాపురం దేవస్థాముల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నీలకంఠాష్టాకం అనే అంశం పట్ల ప్రవచనంనకు విచ్చేసిన మహాసహాస్రావదాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ శ్రీ గరికిపాటి నరసింహరావుకు కుంభ కళశాలతో ఘన స్వాగతం పలికారు. అదేవిదంగా ప్రత్యేకంగా అలంకరణ చేసిన వెండి పల్లకిలో గరికిపాటి వారిని భారీ ఎత్తున ఊరేగింపు మహోత్సవంను అంగరంగా వైభవంగా నిర్వహించారు. దేవస్థానముల కమిటీ చైర్మన్ డాక్టర్ రఘువీరారెడ్డి, ధర్మపత్ని శ్రీమతి సునీతరఘువీర్‌లు పూల బొకే నందించి ఘనంగా సత్కరించారు.అనంతరం రఘువీరారెడ్డి దంపతులు శ్రీమతి సునీతారఘువీర్ లు శ్రీ గరికిపాటి వారి ఆశీస్సులు పొందారు. గరికిపాటి నరసింహరావు వారి అమృతవాక్కు ప్రవచనలుతిలకించడానికిమడకశిర నియోజక వర్గం లోని ప్రజలే కాక కర్నాటకలోని వివిధ ప్రాంతా ల నుంచివేలాది సంఖ్యలో జనం పాల్గొనడం విశేషం.





# 'బొటానికల్ టూర్'లో ప్రకృతి పాఠాలు



- ప్రముఖ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అయిన 'మినర్వా ఇంగ్లీష్ మీడియం స్కూల్' కరస్పాండెంట్ గౌర్ల భాస్కర్ రెడ్డి వినూత్న ఆలోచన
- విద్యార్థులకు ప్రకృతి, పంటలు, మొక్కలు, శాస్త్రీయ పేర్లపై క్షేత్రస్థాయిలో అవగాహన

**అనంతపురం ఫిబ్రవరి 8 మనంన్యూస్ :** విద్యార్థులకు తరగతి గదుల్లో పాఠాలు బోధించడమే కాకుండా ప్రకృతి, పరిసరాలపై అవగాహన కల్పించడంముఖ్యమని అనంతపురం నగరంలోని అశోక్ నగర్ లో ఉన్న ప్రముఖ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అయిన 'మినర్వా ఇంగ్లీష్ మీడియం స్కూల్' కరస్పాండెంట్ గౌర్ల భాస్కర్ రెడ్డి అన్నారు. అనంతపురం నగరంలోని అశోక్ నగర్ లో ఉన్న ప్రముఖఇంగ్లీష్ మీడియం స్కూల్ అయిన మినర్వా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులకు ఆదివారం 'బొటానికల్ టూర్'లో వ్యవసాయము, అడవులు, ప్రకృతి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన



కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో వివిధ రకాల మొక్కలు, వాటి సాంకేతిక పేర్లు వివరించారు. మొక్కల పెంపకం, సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యావరణపరిరక్షణకుసంబంధించి పాటించవలసిన విషయాలను విద్యార్థులకు క్షేత్రస్థాయిలో తెలియజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గౌర్ల భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ బొటానికల్ టూర్ విద్యార్థుల్లో ఆలోచన శక్తిని పెంపొందిస్తుందని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ఆలోచన శక్తిని పెంపొందించి నైపుణ్యాలను పెంపొందిస్తుం దని కరస్పాండెంట్ గౌర్ల భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. క్షేత్ర పర్యటనలతో విద్యార్థులకు అవగాహన ఏర్పడి భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుందని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# తల్లిదండ్రుల తలరాతలు మార్చే శక్తి విద్యార్థులకే వుంది..

### ఎమ్మెల్యే, ఎమ్మెస్ రాజు..



**గుడిబండ ఫిబ్రవరి 8 మనం న్యూస్ :** తల్లిదండ్రుల తల రాతలు మార్చే శక్తి విద్యార్థులకే ఉందని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని కే ఎన్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులు కష్టపడి చదివితే సాధించలేని దశేటూ ఏది ఉండదని ప్రతి విద్యార్థులో బ్రహ్మాండమైన ప్రతిభ ఉంటుందని దానిని ఉపాధ్యాయులు వెలికి తీసి ప్రతి విద్యార్థిని ఉన్నత శిఖరాలకు ఎదిగే విధంగా తీర్చిదిద్దాలనిఆయనఉపాధ్యాయులకు సూచించారు. చాలామంది విద్యార్థులను వారి వారి తల్లిదండ్రులు కూలి నాలి చేసుకుంటూ పాఠశాలకు పంపుతున్నారని అలాంటి విద్యార్థులు తమ తల్లిదండ్రుల తలరాతను మార్చడానికి అద్భుతమైన శక్తి విద్యార్థుల చేతుల్లోనే ఉందని ప్రతి విద్యార్థి రాబోయే పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఇటు గురువులకు అటు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులు బాగా చదువుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులకు తల్లికి వందనం తదితర పథకాలను ప్రవేశపెట్టి వారిని అన్ని రంగాల్లోనూ ఎదగడానికి అనేకమైన మౌలిక సదుపాయాలు కల్పించి విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అదే విధంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. గతంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో ఇంటిలో చదువు కుంటున్న ఒకరికి మాత్రమే అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టి మిగిలిన విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేశాడని కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ఇంటిలో ఎంతమంది చదువుకుం టున్నారో అంతమంది విద్యార్థులకు తల్లికి వందనం అమలు చేసి ఆ నిధులను నేరుగా తల్లుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లక్ష్మినారాయణజిల్లారైతు సంఘం అధ్యక్షులు కే ఎన్ పల్లి సురేష్,సింగల్ విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప,జిల్లావీరశైవలింగాయత్ అధ్యక్షులు దుర్గేష్, శశిధర్ పాండురంగప్ప, స్థానిక నాయకులు గిరేతిమ్మప్ప, గిరీష్, చిక్కీరప్ప, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొలకాల్మూరు ఎమ్మెల్యేను వివాహ కార్యక్రమానికి ఆహ్వానించిన బండి



**రాయదుర్గం ఫిబ్రవరి 8 మనంన్యూస్ :** మొలకలమూరు ఎమ్మెల్యే ను కలిసి వివాహ కార్యక్రమానికి ఆహ్వానించిన నియోజకవర్గం వాల్మీకి అధ్యక్షులు బండి కిష్టప్ప. ఈ మేరకు బళ్లారి నగర ఎమ్మెల్యేను వివాహ కార్యక్రమం కు ఆహ్వానిస్తున్న బండి క్రిష్టప్పప్రముఖులను వివాహ కార్యక్రమం కు ఆహ్వానంరాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప తన కుమారుడు నరేంద్ర వివాహ కార్యక్రమం కు పలువురు ప్రముఖులను ఆహ్వానించారు. ఆదివారం వాల్మీకి సంఘం అధ్యక్షులు బండి ఆ సేవాసమితిప్రధాన సలహాదారులు తలారి రాజప్ప, మీడియా సలహాదారులు తలారి మల్లయ్య, కొడగల్ రుద్ర సభ్యులతో కలిసి ఆయన బళ్ళారి, మొలకాల్మూరు, రాంపుర తదితర ప్రాంతాలకు చెందిన పలువురు ప్రముఖులను కలుసుకొని పెళ్లి పత్రికలు అందజేసి తన కుమారుడి వివాహ కార్యక్రమానికిఆహ్వానించారు. కర్ణాటక చిత్రదుర్గం జిల్లా మొలకాల్మూరు ఎమ్మెల్యే ఎన్.వై.గోపాలకృష్ణ, బళ్లారి నగర ఎమ్మెల్యే గుమ్మనూరు నాగేంద్ర, మొలకాల్మూరు మాజీ ఎమ్మెల్యే నేర్లగుంట తిప్పేస్వామి, బిజెపి మాజీ మండల కన్వీనర్ డాక్టర్ పి.ఎం మంజునాథ్, సిఐ నాగరాజు, ఎస్సై మహేష్ లక్ష్మణ హోస్పేటె, బళ్ళారి కార్పొరేటర్ సలహాదారులు గుమ్మనూరు జగన్నాథ్ తదితరులను కలుసుకొన రాయదుర్గం పట్టణం మార్కెట్ యార్డ్‌లో జరుగునున్న తనకుమారుడివివాహానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బళ్లారి జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షులు ముది మల్లయ్య, రాయదుర్గం సంక్షేమసేవా సమితి సేవాసమితి సభ్యులు నాగలాపురం గోవిందు, బిబిఆర్, ఓబుళాపురం తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షులు తాయప్ప, లక్ష్మీనారాయణ, మిత్రులు విశ్రాంతి ఉద్యోగి గొల్ల గోపాల్, కోపరేటివ్ సొసైటీ విశ్రాంతి డీలర్ వడ్డే మారెప్ప, చిరు వ్యాపారి గాజుల భీమరాజులు పాల్గొన్నారు.





# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

- బిసి బాలికల వసతి గృహం విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ
- ఎమ్మెల్యే టిడిపి జిల్లా అధ్యక్షుడు ఎం ఎస్ రాజు



**మడకశిర, ఫిబ్రవరి 08,మనంన్యూస్:** మడకశిర పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన 19 లబ్ధిదారులకు రూ 19 లక్షల 50 వేల 801 రూపాయలు విలువగల చెక్కులను బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే, టిడిపి జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజు పంపిణి చేసారు.అదేవిదంగా పట్టణంలోని స్థానిక బిసి బాలికల వసతి గృహం విద్యార్థినిలకు ఎమ్మెల్యే దుప్పట్లు పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, రాష్ట్ర కుంచిటి వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ ఎన్. లక్ష్మీనారాయణ,టిడిపి కుంచిటి వక్కలిగరా సాధికారత కన్వీనర్ వివిఎం పాండురంగప్ప,మండల టిడిపి క్లస్టర్ కన్వీనర్, మాజీ సర్పంచ్ గుండుమల చంద్రప్ప, అగలి జడ్పీటీసీ ఉమేష్ ఆచారి,మడకశిర టిడిపి మండల కన్వీనర్ కల్లుమర్రి నాగరాజు, తదితరులు, నాయకులు, లబ్ధిదారులు, హాస్టల్ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.



# ఏపీ ఎన్ జీజీఓల రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులకు ఘన సన్మానం శుభాకాంక్షలు

### శ్రీ సత్యసాయి జిల్లా ఏపీఎన్ జీజీఓల సంయుక్త కార్యదర్శి సిగ్బత్ఉల్లా



**మడకశిర, ఫిబ్రవరి 08,మనంన్యూస్:** విజయవాడలో ఆదివారం జరిగిన ఏపీ ఎన్జీజీఓల ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన అలపర్తి విద్యాసాగర్, కార్యదర్శి రమణలతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు శ్రీ సత్యసాయి జిల్లా ఏపీఎన్జీజీఓల యూనియన్ సంయుక్త కార్యదర్శి బి. సిగ్భత్ ఉల్లా, శుభాకాంక్షలు తెలిపిన శ్రీ సత్య సాయి జిల్లా జాయింట్ సెక్రటరీ బి. సిబ్గత్ ఉల్ల, మడకశిర తాలూకు కార్యదర్శి ట్రజరీ మరియు మడకశిర హరినాథ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలసి శాలువా కప్పి,పూలబొకేలు అందించిఘనంగాసన్మానించారు,శుభాకాంక్షలుతెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించే విధంగా తమవంతు బాధ్యతగా కృషి చేయాలని అధ్యక్ష, కార్యదర్శులు, కారువర్గ సభ్యులను కోరడం జరిగిందని, దింతో వారు సానుకూలంగాస్పందించారనిసిగ్భత్ఉల్లా, హరీష్ లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మడకశిర తాలూకు యూనియన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు



## ఘనంగా కె.వి.ఆర్ రియల్ ఎస్టేట్ వెంచర్ 8 వ వార్షికోత్సవం

**హిందూపురం (మనం న్యూస్) ఫిబ్రవరి 08:** హిందూపురం పట్టణానికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కెవిఆర్ లేఅవుట్ మరియు పట్టణానికి అతి సమీపాన అతి దగ్గరగా మొదలో ఉన్న ప్రైడ్ అమరావతి, కెవిర్ వెంచర్ వెంచర్ల 8 వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వెంచర్ అధినేతలు కెవి కొండారెడ్డి, విశ్వనాథరెడ్డిల ఆధ్వర్యంలో మేనేజర్ ఖాన్ నిర్వహణలో అభివృద్ధి పరుస్తున్న కెవిఆర్ లేఅవుట్ దినదిన అభివృద్ధి చెందుతూ ఉందని కస్టమర్లు పేర్కొన్నారు ఈ సందర్భంగా కస్టమర్లు టీచర్ ఆదినారాయణ, శంకర్ నాయక్, జయదేవ్, ఆనంద్ రాజు, సిరి ఆదినారాయణ, ఓం శక్తి స్వామి తదితరులు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో విశాలమైన రోడ్లు, మురుగు కాలువలు, విద్యుత్ సౌకర్యం, నీటి సదుపాయం రవాణ సౌకర్యం తదితర సదుపాయం అన్ని రకాలుగా వెంచర్లలోని కస్టమర్లకు అనుకూలముగా ఉన్నాయని తెలిపారు.కేవీఆర్ వెంచర్ హిందూపురం పట్టణానికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నది. వెంచర్ లోని ప్రతి ఒక్క సెంటు భూమికి కూడా అన్ని రకాల డాక్యుమెంట్స్ లింక్ డాక్యుమెంట్స్ ఉండటం వల్ల ఫ్యూచర్లో మనకు ఎటువంటి ఇబ్బంది కలగదని పేర్కొన్నారు.

## మహిళా సమైక్యలను బలోపేతం చేయాలి

**హిందూపురం (మనం న్యూస్) ఫిబ్రవరి 08:** హిందూపురం పురపాలక సంఘంలోని మహిళా సమైక్యలను, ఎస్.ఎల్.ఎఫ్లను బలోపేతం చేయాలని హిందూపురం మెప్మా అధికారి ఎల్



గంగులయ్య ఆదివారం మంజునాథ్ మహిళా సమైక్యకు కార్యక్రమంలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నిరుపేద మహిళ స్వయం శక్తి సంఘంలో చేరి ఆర్థిక, సాంకేతిక, సామాజిక జీవన విధానంలో మార్పు తెచ్చుకోవాలన్నారు. పట్టణంలోని ప్రతి ఎస్ఎల్ఎఫ్ సమావేశాలు సక్రమంగా జరగాలని, పొదుపులు, అంతర్గత రుణాలు, బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను చెల్లింపులు తప్పకుండా జరిగాలని చెప్పారు. పుస్తక నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యతను నిర్మూలన చేయడమే ప్రధాన లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో సీఓ నాగేంద్ర, ఎస్ఎల్ఎఫ్ ఆర్పీ నసీమ, సంఘ సభ్యులు, తల్లితరులు పాల్గొన్నారు.

## పాలసముద్రం క్రాస్ లో చిరు వ్యాపారస్తులని చిరునవ్వుతో పలకరించిన మంత్రి సవితమ్మ




**గోరంట్ల ఫిబ్రవరి 8 మనం న్యూస్:** గోరంట్ల మండల పర్యటనలో భాగంగా పాలసముద్రం క్రాస్ లో అటువైపు వెళుతున్న మంత్రి సవితమ్మ చిరు వ్యాపారులను చూసి కారు ఆపి వారితో వ్యాపారాలు ఎలా ఉన్నాయి? ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా....? మహిళలకు శ్రీ శక్తి పథకంలో భాగంగా ఫ్రీ బస్సులో ప్రయాణాల గురించి అడిగి కాసేపు వారితో ముచ్చటిం చారు. ఇందులో భాగంగానే చిరు వ్యాపారస్తులు మంత్రి సవితమ్మ కు చిరు కానుకగా పూలు పండ్లు శాలువాలతో సన్మానించారు. మంత్రి అయ్యుండి కూడా ఒక సామాన్య ర్యాలీగా సాధక బాధలను వారితో ముచ్చడించటం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు.

## సముగ్ర కుటుంబ సర్వే కి సహకరించండి

### – ఎంపీడీవో మునెప్ప

**ఆమడగూరు, ఫిబ్రవరి 8 మనంన్యూస్:** మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో సమగ్ర కుటుంబ సర్వే ప్రభుత్వం చేపట్టినట్లు ఈ సమగ్ర కుటుంబ సర్వే కి మండల ప్రజలు సహకరించాలని ఎంపీడీవో మునెప్ప ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్ అందించాలని ఉద్దేశంతో సమగ్ర కుటుంబ సర్వే చేపట్టినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఈ సర్వే ఆధారంగానే ఫ్యామిలీ కార్డు మంజూరు అవుతుందన్నారు. ఈ ఫ్యామిలీ కార్డు అన్ని సంక్షేమ పథకాలకు ప్రమానికం కానుందని అన్నారు .మండలంలోని ప్రజలందరూ తప్పనిసరిగా సమగ్ర కుటుంబ సర్వే చేయించుకుని, అధికారులకు సహకరించాలన్నారు.



## తహశీల్దార్ కార్యాలయానికి ప్రహరి గోడ నిర్మాణంకు మోక్షం లేనట్టేనా..

- -22ఏళ్లు గడిచిన నేటికీ కార్యాలయం పునాదుల దాటని పరిస్థితి.
- -నిధుల కొరతతోనే నిలిచిపోయిన ప్రహరి గోడ.
- -తహశీల్దార్ భవన సముదాయం 2004లో యంపిడిఓ, తహశీల్దార్ కార్యాలయాలు నిర్మించారు.
- -ప్రహరీ గోడ నిర్మాణంను గాలికి వదిలేశారు.
- -ఎన్ని ప్రభుత్వాలు మారిన పట్టించుకునే వారే కరువు..

**కుందుర్పి, ఫిబ్రవరి 8,మనం న్యూస్ :** కుందుర్పి మండల తహశీల్దార్ కార్యాలయానికి ప్రహరీ గోడ నిర్మాణంకు మోక్షం లేనట్టేనని మండల ప్రజలు బహిరంగంగా చర్చించుకోవడం కోసమెరుపు. ఈ తాసిల్దార్ కార్యాలయానికి ప్రహరి గోడ నిర్మాణానికి నిధుల కొరత పట్టిపీడిస్తుంది. తద్వారా ఈ కార్యాలయం నిర్మించి 22 ఏళ్ళు గడిచి వెళ్లిన నేటికీ పునాదులకే పరిమితమైన పరిస్థితి నెలకొంది అనడంలో సందేహం లేదు. 2004 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ప్రజలకు పరిపాలన సౌలభ్యం కోసం, ప్రజా సమస్యలను పరిష్కరించడానికి తాసిల్దార్ కార్యాలయం భవన సముదాయం, మండలాభివృద్ధి కార్యాలయం సముదాయం గుత్తేదారులు నిర్మించారు ఆనాడు. అయితే ఎంపీడీవో కార్యాలయానికి నాలు దిశలు గోడలును విశాలంగా నిర్మించారు. అయితే మండల తాసిల్దార్ కార్యాలయానికి ప్రహరీ గోడలు నిర్మాణం నిర్మించడం నిధుల కొరత అప్పట్లో గాలికి వదిలేసారు. తద్వారా నిదుల కొరతే కారణంగా ప్రహరీగోడలు నిర్మాణం నిలిచిపోయిందని తెలుస్తోంది అని ప్రజలు భావిస్తున్నారు. ఆనాటి నుంచి నేటిదాకా తాసిల్దార్ కార్యాలయానికి పునాదులు వేసి బేశమట్టం వేసి వదిలివేశారు. ఈ బేసమట్టం పనుల సైతం దెబ్బతిని నేలమట్టమైన దుస్థితి నెలకొంది. ఆనాటి నుంచి ఈనాటి దాకా ఎన్ని ప్రభుత్వాలు మారినా తాసిల్దార్ కార్యాలయం ప్రహరీ గోడ నిర్మాణం పనులు చేపట్టడానికి నిధులు మంజూరు చేయాలని ఏ ప్రభుత్వం కానీ , ప్రజాప్రతినిధులు ,అధికారులు పట్టించుకున్న దాఖలు లేవు అని మండల ప్రజలు విమర్శలు ఉన్నాయి. ఆ కార్యాలయంలో నాలు దిశలో పచ్చని మొక్కలను పెంచి హరితవనం చేయాలనే సంకల్పించారు. అయితే పచ్చని చెట్లకు రక్షణ కవచంగా ఉండాల్సిన ప్రహరి గోడ నిర్మించకపోగా పచ్చని చెట్లను మేకలు, గొర్రెలు పశువులు ముగ జంతువులు చెట్లను కొరికి వేయడంతో చెట్లు మెలచలేదు. చెట్లను నాలు దిశలో పెట్టగా కేవలం దక్షిణ దిశగా మాత్రమే చెట్లు పెరగడం జరిగింది. అదే ఎంపీడీవో కార్యాలయంలో అప్పట్లోనే ప్రహరీ గోడ నిర్మించగా పచ్చని చెట్లు నాలు దిశలులో పరడెల్లుతున్నాయి అని అనడంలో సందేహం లేదు. అంతేకాకుండా ఆ కార్యాలయంలో రాత్రి సమయంలో రెవెన్యూ కార్యాలయం క్షేత్రస్థాయి రెవిన్యూ సిబ్బంది కాపులా రక్షణగా నిద్రించాలన్న అక్కడ పుట్టలో వెలసడంతో విష సర్పాలు, పాములు సంచరిస్తుండడంతో బీతీ నెలకొంది. ఈ కార్యాలయం గ్రామానికి దూరంగా వెలసాడంతో ప్రహరీ గోడలు నిర్మించకపోగా రక్షణ కవచంలా రక్షణ ప్రహరీలు లేకపోయింది. ఏది ఏమైనా జిల్లా కలెక్టర్ కానీ, కళ్యాణ దుర్గం కూటమి ప్రభుత్వం శాసనసభ్యులు, అమిలినేని, సురేంద్రబాబు లు వెంటనే స్పందించి కుందుర్పి తాసిల్దార్ కార్యాలయానికి ప్రహరీ గోడ నిర్మించేలా ,నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.



## మహిళలను అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యం.

### – మునిసిపల్ కమిషనర్ మల్లికార్జున వెల్లడి

**హిందూపురం (మనం న్యూస్) ఫిబ్రవరి 08:** హిందూపురం పురపాలక సంఘం 1వ వార్డు బిసి కాలనీ నందు శుక్రవారం నిర్వహిస్తున్న అక్షరాంధ్ర కేంద్రం నకు మున్సిపల్ కమీషనర్ వి. మల్లికార్జున సందర్శించారు. అక్షరాంధ్ర కేంద్ర నిర్వహణ తీరును పరిశీలించి అభ్యాసకులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా హిందూపురం పురపాలక సంఘంలోని నిరక్ష రాశ్యతను నిర్మూలించడమే ప్రధాన లక్ష్యంగా హిందూపురం మున్సిపల్ కమీషనర్ వి. మల్లికార్జున పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 1 వ వార్డు బి.సి. కాలనీ లోని వయోజన విద్యాకేంద్రాన్ని సందర్శించి మహిళలతో ముచ్చటించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో హిందూపురం పురపాలక సంఘం నందు 9000 మంది మహిళలను అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా ప్రణాళికా బద్ధంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. మెప్మా సంస్థ ద్వారా వాలంటరీ టీచర్లను నియమించి అభ్యాసకులను గుర్తించి వారికి బోదనా అభ్యాస ప్రక్రియలో భాగంగా మెప్మా సంఘాలలోని 9000 మంది మహిళలను ఎంపిక చేసి భవదించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మెప్మా అధికారి యల్. గంగులయ్య, అక్షర ఆంధ్ర కో-ఆర్డినేటర్ వార ప్రసాద్ , కమ్యూనిటీ ఆర్గనైజర్లు, సంబందిత సమాఖ్య ఆర్.పి. యస్. ఆయేషా పాల్గొనడం జరిగింది.





## హెడ్ కానిస్టేబుల్‌కి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

### – ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్...

**పుట్టపర్తి ఫిబ్రవరి 8 మనం న్యూస్:** శ్రీ సత్య సాయి జిల్లా పెనుకొండ లోని కోర్టు నందు విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ సురేష్ అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. హెడ్ కానిస్టేబుల్ సురేష్ మృతదేహానికి ఆదివారం అనంతపురంలో ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అనంత పురంలోని రాజీవ్ కాలనీకి చెందిన చెందిన ఇతను 1996 సంవత్స రంలో సివిల్ కానిస్టేబుల్ గా పోలీస్ విభాగంలో చేరారు. హెడ్ కానిస్టేబుల్ గా రాయదుర్గం, బత్తలపల్లి, పెనుగొండలో పనిచేశారు. ప్రస్తుతం పెనుగొండ కోర్టులో విధులు నిర్వహిస్తున్నారు. శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ ఉత్తర్వులు మేరకు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం వారి కుటుంబానికి రూ,లక్ష రూపాయలను అందజేశారు. అనారో గ్యంతో మృతి చెందిన సురేష్ కుటుంబానికి జిల్లా ఎస్పీ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈరోజు అనంతపురంలో జేఎన్టీయూ సమీపంలోనే క్రైస్తవల స్మశాన వాటికలో జరిగిన అంత్యక్రియల



కార్యక్రమంలో పెనుగొండ సి ఐ రాఘవన్, ఆర్ ఐ వలి, పెనుగొండ ఎస్సై వెంకటేశ్వర్లు, పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్య కుమార్, ఉమ్మడి జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్ , గాండ్ల హరినాథ్, సిబ్బంది బ్యాచిమేట్లు, బంధువులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

**- ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రైవేట్ డిగ్రీ కళాశాల మేనేజ్మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పెద్దరాసు భక్తవత్సలం...**



**గోరంట్ల ఫిబ్రవరి 8 మనం న్యూస్:** పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖల మంత్రి సవితమ్మకు ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రైవేట్ డిగ్రీ కళాశాల మేనేజ్మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పెద్దరాసు భక్తవత్సలం వినతి పత్రం అందజేశారు.ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు సంబంధించిన పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్ నిధులను విడుదల చేయాలని ఆదివారం మంత్రి స్వగృహంలో ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ సభ్యులు మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కి ప్రైవేట్ డిగ్రీ కళాశాల మేనేజ్మెంట్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నామని కళాశాలలో పనిచేసే సిబ్బంది వారి కుటుంబాలు కూడా సంస్థలపై ఆధారపడి ఉంటాయన్న విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత రెండు సంవత్సరాలకు సంబంధించి కేవలం ఒకటిన్నర క్వార్టర్స్ ఫీజు రియంబర్స్మెంట్ మాత్రమే విడుదల అయ్యిందని ఇంకా ఆరున్నర క్వార్టర్స్ ప్రభుత్వం బకాయిలు పెట్టిందని దీంతో కళాశాలలో నడపలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వం మూడు క్వార్టర్లు పెండింగ్ పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి బకాయిలను విడుదల చేయాలన్నారు. బకాయిలు విడుదల చేయని పక్షంలో ఇలాంటి పరిస్థితి కొనసాగితే అధ్యాపకుల జీతాల చెల్లింపులు, విద్యా నాణ్యత పరిరక్షణ, కళాశాల నిర్వహణ వంటి అంశాలు తీవ్ర ప్రభావితం అయ్యే ప్రమాదం పొంచి ఉండే అవకాశం లేకపోలేదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ లు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల దుస్థితిని ఆలోచించి తక్షణమే బకాయిలను విడుదల చేయాలన్నారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాల మేనేజ్మెంట్లు అప్పులు చేసి అధ్యాపకులకు జీతాలు చెల్లిస్తున్న దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం స్పందించి మా సమస్యలను పరిష్కారం చేయాలని ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రెసిడెంట్ భక్తవత్సలం కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ పి వి ఎం డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పెద్దరాసు సుబ్రహ్మణ్యం ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహ విముక్తి రథయాత్ర, ఫోక్స్ చట్టాలపై అవగాహన




**పుట్టపర్తి ఫిబ్రవరి 8 మనం న్యూస్:** జిల్లా ఎస్పీ శవిస్ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు సత్యసాయి,జిల్లాలో బాల్యవివాహ వ్యవస్థను నిర్మూల యించాలన్న సంకల్పతో బాల్య వివాహ విముక్తి రథయాత్ర వాహనం ద్వారా గ్రామాలలో పోలీసులు, శక్తి టీం బృందాలు , స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం జిల్లాలోని పలు గ్రామాలలో నూతన చట్టాలు బాల్య వివాహాలు పోక్సో వంటి వాటిపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు అరికట్టాలనే ఉద్దేశం తో సత్యసాయి జిల్లాలో ఈ రథ యాత్ర చేపట్టడం జరిగిందని పోలీసులు శక్తి టీం బృందాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

## సైన్స్ ప్రయోగాలే శాస్త్రీయ అభివృద్ధికి పునాది

**- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్**

**అనంతపురం, ఫిబ్రవరి 8, మనం న్యూస్:** విద్యార్థులు చేసే వినూత్న సైన్స్ ప్రయోగాలే శాస్త్రీయ అభివృద్ధికి పునాది అవుతుందని మాజీ ఎమ్మెల్సీ, జేవీవీ రాష్ట్ర గౌరవ సలహాదారు డాక్టర్ ఎం.గేయానంద్ అన్నారు. జేవీవీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సంగమేష్ నగర్ ఆఫీస్ నందు రాష్ట్రస్థాయి యురేకా సైన్స్ ఎక్స్ పో-2026 మరియు ఇతర అంశాలపై చర్చ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గేయానంద్ మాట్లాడుతూ ప్రతి ఏటా రాష్ట్రవ్యాప్తంగా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్న అనుభవం మనకు ఉందని, అందులో భాగంగానే విద్యార్థులలో సైన్స్ ప్రతిభా పాటవాలను వెలికి తీయాలనే ఉద్దేశంతో యురేకా సైన్స్ ప్రయోగాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు వినూత్నంగా ఆలోచించి సైన్స్ ప్రయోగాలు చేయడం ద్వారా జ్ఞానాన్ని సంపాదించడంతో పాటు కొత్త అంశాలను కనుగొనే అవకాశ ముందన్నారు. నేడు పాఠశాల స్థాయిలో విద్యార్థులు చేసే ఈ ప్రయోగాలే భవిష్యత్తులో వారు రాణించడానికి ఎంతో ఉపయోగపడతాయని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఎటువంటి ఖర్చు లేకుండా లో కాస్ట్-నో కాస్ట్ తో విద్యార్థులు చేసే ప్రయోగాలు వారిలో ప్రత్యేకమైన ఆలోచనలను రేకెత్తిస్తాయని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎం.ఆదిశేషు అన్నారు. ఉన్నత పాఠశాల తరగతులకు చెందిన విద్యార్థులు వ్యక్తిగతంగా కానీ, గ్రూపుగా కానీ ఏర్పడి ప్రయోగం చేసి వాటిని వీడియో ద్వారా రాష్ట్ర కమిటీకి పంపించాలని కోరారు. ఇందుకు మార్చి 8 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని, విజయవంతం కావడానికి కృషి చేయాలని జిల్లాలోని ప్రతి స్కూలు నుండి విద్యార్థులు ఈ యురేకా సైన్స్ ప్రయోగ పోటీలలో పాల్గొనేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం యురేకా సైన్స్ ఎక్స్ పో పోస్టర్లను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, జేవీవీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.పి.చిత్తప్ప, కె.వీరరాజు, కోశాధికారి మహమ్మద్ జిలాన్, జిల్లా అడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసరావు, సమతా నాయకులు కె.నాగరత్న జెవివి నగర అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్ రెడ్డి,తిరుపాల్ నాయకులు రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, ముత్యాలు, ప్రసాద్, రాఘవేంద్ర, తిప్పేస్వామి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



### ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గంలో

# పదవ తరగతి మోడల్ పరీక్ష

**-విద్యార్థులలో భయం వెళ్లగొట్టేందుకు మోడల్ పరీక్ష**
**-నేటి విద్యార్థులే రేపటి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలి**
**-పదవ తరగతి మోడల్ పరీక్ష క్వశ్చన్ పేపర్ను విడుదల చేస్తున్న కళ్యాణదుర్గం డిఎస్పి రవిబాబు**

**కళ్యాణదుర్గం : ఫిబ్రవరి 8 మనం న్యూస్ :** ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం పట్టణంలోని 10వ తరగతి మోడల్ పరీక్షకు 350 మంది విద్యార్థులు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్పి రవిబాబు గారు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పదవ తరగతి మోడల్ పరీక్ష ను రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులలో భయం వెళ్ళగొట్టేందుకు పబ్లిక్ పరీక్షల కంటే ముందు నిర్వహించడం జరుగుతా ఉంది అన్నారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు వెళ్తున్న విద్యార్థులు చాలామందిలో భయం వెంటాడుతూ ఉంటుంది ఆ భయాన్ని పోగొట్టి విద్యార్థులు పరీక్షలను ఫ్రీగా రాసే విధంగా ముందస్తుగా ఇలాంటి పదవ తరగతి మోడల్ పరీక్షలు పెట్టడం వలన విద్యార్థులలో భయం వెళ్లిపోతుందని తెలిపారు. ఇప్పుడున్న విద్యార్థులే రేపటి సమాజాన్ని మార్చే పౌరులుగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమాజాన్ని మార్చే శక్తి కేవలం విద్యార్థులకు మాత్రమే ఉందని తెలిపారు. ఈ సమాజాన్ని ఒక విద్యార్థి మార్చగలడు, ఈ సమాజాన్ని ఒక పెన్ను మార్చగలదు ఈ సమాజాన్ని ఒక పుస్తకం మార్చగలదు ఈ సమాజాన్ని ఒక టీచర్ మార్చగలడు అని గతంలో మేధావులు చాలా మంది చెప్పేవారన్నారు. ప్రతి ఒక విద్యార్థిని విద్యార్థులు కూడా ప్రస్తుత విద్యాభ్యాసంలోనే చదువుతోపాటు ఈ సమాజంలో జరుగుతున్న అవినీతిని కూడా ఏదైనా తప్పులు కానీ మనం ప్రశ్నించడం నేర్చుకోవాలని పిలుపునిచ్చారు.2026లో 10వ తరగతి ఉత్తీర్ణత శాతం మన జిల్లా ప్రథమ స్థానంలో ఉండాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ప్రతి ఒక విద్యార్థులు కూడా 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ఎటువంటి భయం లేకుండా ప్రశాంతంగా రాయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజవర్గ ఉపాధ్యక్షులు హర్షవర్ధన్ మురళి రజిని నాయకులు మోహన్ మనోజ్ సన్నీ జగదీష్ గురు తదితరులు పాల్గొన్నారు.



# గిట్టుబాటు కాలేదంటూ రోడ్లెక్కిన జెసిబిలు

**హిందూపురంలో జెసిబి యజమానుల నిరసన ర్యాలీ**



**హిందూపురం (మనం న్యూస్) ఫిబ్రవరి 08:** శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో జెసిబి యజమానులు గళమెత్తారు. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా తమ సేవల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు పట్టణంలో భారీ జెసిబి ర్యాలీ నిర్వహించి తమ డిమాండ్‌ను వినిపించారు. హిందూపురం పట్టణంలో జెసిబి యంత్రాల యజమానులు ర్యాలీ చేపట్టారు. పెరిగిన డీజిల్ ధరలు, విడిభాగాలు మరియు నిర్వహణ ఖర్చుల దృష్ట్యా జెసిబి బాడుగ ధరలను పెంచాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సూగూరు ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో యజమానులందరూ కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ వేదికగా ఒక అసోసియేషన్ కమిటీని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అనంతరం తమ డిమాండ్లను చాటిచెబుతూ జెసిబి వాహనాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సూగూరు ఆంజనేయ స్వామి దేవాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ వాల్మీకి సర్కిల్, పొట్టి శ్రీరాములు సర్కిల్, ఎం.ఎఫ్ రోడ్డు, అంబేద్కర్ సర్కిల్ మరియు సద్భవన్ సర్కిల్ మీదుగా తెలుగు తల్లి విగ్రహం వరకు కొనసాగింది. పదుల సంఖ్యలో జెసిబిలు రోడ్లపైకి రావడంతో ఈ ర్యాలీ అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ సందర్భంగా జెసిబి వాహనాల ఓనర్ల అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ తమ జీవనోపాధి కోసం జెసిబి వాహనాల కొనుగోలు చేసి ప్రజా అవసరాల పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు, గతంలో గంటకు1000 రూపాయలు చొప్పున పరిశ్రమల పనులు,రైతులపనులు,భవన నిర్మాణాల పనులు చేస్తుండే వారమన్నారు,అయితే ప్రస్తుత పరిస్థితులలో జెసీబీ వాహనాల కొనుగోలు రేట్లు పెరగడం, డీజిల్ రేట్లు, మెయింటెనెన్స్ చార్జీలు పెరగడంతో ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు,దీంతో కాలానికి అనుగుణంగా రేట్లు పెంచడానికి యూనియన్ ద్వారా ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగిందన్నారు, ప్రస్తుతం జెసిబి యంత్రాల ద్వారా చేపట్టే కనీస పనికి 3000 వేల రూపాయలు, గంటకు1300 రూపాయలు ధర నిర్ణయించడం జరిగిందన్నారు, దీన్ని దృష్టిలో పెట్టుకొని జెసిబి వాహనాలు, ట్రాక్టర్ల పనులకు ధరలు పెంచడం అయినది దయ చేసి కస్టమర్లు సహకరించాలని వారు కోరారు, ఈ కార్యక్రమంలో జెసిబి ఓనర్లు హనుమంత్ రెడ్డి, నేపాల్ నాగరాజ్, ఆనంద్ కుమార్,లోకేష్,ఆనంద్, వెంకటేష్, సడ్లపల్లి మల్లికార్జున, శివారెడ్డి, ప్రకాష్,సంతోష్ రెడ్డి, మనోహర్,దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కుందుర్పిలో వెలసిన అతి పెద్ద ఏకశిల కొండ చరిత్ర....

- జిల్లాలోనే దేవాలయాలకు పుట్టినిల్లు కుందుర్పి.
- మొదటి పాల్యెగాడు కోనేటి నాయుడు.
- రాయదుర్గం హండే రాజును తరిమికొట్టిన కొనేటి.నాయుడు.
- బీజాపుర సుల్తాన్ కు పెనుగొండ గ్రామాన్ని స్వాధీనం చేసిన.కొనేటి.నాయుడు.
- 1652లో సుల్తాను కుందుర్పి గ్రామాన్ని కొ.నా.కు బహుమానంగా ఇచ్చారు.
- 1800లో బళ్లారి వారి అధీదనంలో రాయలసీమ జిల్లాలు వెళ్లాయి.
- అనంతపురం జిల్లా బళ్లారిలోని ఇతిహాసిక కథలలో నేతి, రఘురాం రచయిత రచనలును చరిత్ర చే వెల్లడి



కుందుర్పి లో చరిత్రలో మరి ఎక్కడ లేని విధంగా అతి పెద్ద ఏకశిల కొండ చరిత్ర కలదు. కుందుర్పి మండలం చరిత్రకు ప్రతి రూపంగా నిలిచినది. అనంతపురం జిల్లాలోని కొందరికి మండలం దేవాలయాల పుట్టినరోజు వెరిజల్లుతుంది. ఇక్కడ అలనాటి రాజుల కాలంలో నిర్మించిన అనేక పురాతన ఘన చరిత్ర కలిగిన వందలాది దేవాలయాలు వెలిశాయి. ఎపి రాష్ట్రం లోని అనంతపురం జిల్లా ఇతిహాస కథలు కర్ణాటకలోని బళ్ళారిలో కన్నడ రచయిత నేతి, రఘురాం, తెలుగులోకి అనువదించిన రచయిత దేవరాం తెలియజేసిన చరిత్ర వివరాలులోకి వెళితే ఇలా. కుందుర్పి అను గ్రామం అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం తాలూకాలోని కలదు. ఇది కళ్యాణదుర్గం తాలూకాలో నైరుతి మూలన వుంది



కుందుర్పి గ్రామం జిల్లా కు 87కిలోమీటారులు దూరం లోవెలసినది. ఒక ప్రక్కన ఈ గిరి నిండు గర్భనిల శిరోజాల వెరబొసుకొన్న మహిళల, మరొక ప్రక్కన శివుడు అవతరించినట్టు చాలా సుందరంగా జనులకు దర్శనం కలగించేలా కనిపిస్తుంది. అంతేకాకుండా అందరికీ శిఖరాగ్ర భాగాన అందరికీ గ్రామ దేవత శ్రీ కుందుర్పమ్మ దేవత మూర్తి స్వయంభుగా వెలసింది,కాని గ్రామంలోనూ సందర్భంలో దేవత ఆలయం వెలిసినది.

గ్రామంలో 2 ఎగువదిగువ ఆలయాలు వెలిసి ఉన్నాయి. భక్తులు కొండపైకి ఎక్కని చేతకాని వారు , కొండ కింద వెలిసి ఆలయంలో కొలువు దీరిన నియమ నిష్టితో, భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఈ గ్రామం చెంతన వున్న పెద్ద కొండ సుమారు పదులు సంఖ్యలో విస్తీర్ణం ఎకరాల్లో వ్యాప్తి చెందినది, సముద్ర భూమట్టానికి 3,000లు అడుగుల ఎత్తులో ఈగిరి వెలసిఉంది. ఈ కొండ ఒకవైపు ఎటు వాలుగా లేక గొడవలే చాలా చక్కగా చూడముచ్చటగా కలదు.ఒక పల్లె గాడు గరిడీ కొండపైన అక్కడ కోటను కట్టియుండెను. ఆ కోటలో ఇప్పుడు పాడబడినది దాని గుర్తులు నేటికీ ఇప్పటికీ మనము చూడవచ్చును. ఈ



గ్రామమున వుండిన పాళ్యగాడులో కోనేటి నాయుడు మొదటివాడు చెప్పవచ్చు. ఈ కోనేటి నాయుడు కర్ణాటకలోని బీజాపురంలో వున్న సుల్తాన్ కు పెనుగొండ గ్రామమును స్వాధీనం చేశారు.. తద్వారా బీజాపూర్ సుల్తాను చాలా సంతోషించి కుందుర్పి గ్రామమును కోనేటి నాయుడికి బహుమానంగా 1652లో విచ్చేసెను. అప్పటినుండే ఈ గ్రామం కొనేటి నాయునికే స్వాధీనంలో ఉండెను. కోనేటి నాయుడు పెనుగొండ నుండి వచ్చినప్పుడు పెనుగొండ యందు ఉన్న విగ్రహాలను పెక్కింటిని తనతో కూడా తీసుకొని పోయెను. ఆ చుట్టూ ముట్టు గ్రామాలలో నందు జనులు దేవాలయములను కట్టించినప్పుడు కుందిర్పి నుండి విగ్రహములను తీసుకొని పోయి ప్రతిష్ట చేయుచుండిరి. కళ్యాణదుర్గం నకు సుమారు 40కి,మి దూరంలో రాయదుర్గం గ్రామం వెలిసింది. అది ఆనాడు బళ్లారి జిల్లాలోనిది. పూర్వం పల్లె గాడు ఉండెను. పల్లె గాడు ఒక చిన్న రాజు ఉండేవారు. అతనికి అదే గ్రామంలో వున్న మరొకరుతో కలహం కలగెను. అప్పుడు ఎదురు కచ్చిదారు కోనాటి నాయుడుని సహాయమును కోరారు. ఇతని సాయం చేయమని రాదుర్గమున ఉన్న పాల్యె గాడిని పారద్రోల వలనని వారు తలచి ఉండరి. ఆ ప్రకారం కోనేటి నాయునికి జాబును వ్రాసిరి. అతడు ఇదే సహాయమని సంతోషంతో సమ్మతించెను. పిదప కోనేటి నాయుడు తన సైన్యంతో కుందుర్పి నుండి- రాయదుర్గంనకు ప్రయాణమయెను. కోనేటి నాయుడు రాయదుర్గమును చేరి ఆ పాల్య గాడీని సులభంగా హండే రాజును పారద్రోలెను. అప్పటినుండి రాయదుర్గమును కొట కోనేటి నాయుడిని పాలయ్యెను. 1800 ప్రాంతంలో నిజాం రాజులుకు బ్రిటిష్ ధరలతో కుదరచుకున్న ఒప్పందం ప్రకారం నేటి రాయలసీమ కర్ణాటకలోని బళ్లారి వారి ఆధీనంలోకి వెళ్ళింది. 1881 డిసెంబర్ 28న అనంతపురం జిల్లా ఏర్పాటు చేశారు. అప్పటివరకు బళ్లారి జిల్లాలోని అనంతపురం ఉండేది. ఈనేపథ్యంలో

బాలులరా ఈ చరిత్ర తిలకించారు కదా.ఇద్దరు కలహ వున్న నందున మూడవ వానికి లాభమైనది. కనుక మీరు ఎప్పుడు ఒకరితో మరొకరు కలహం జరగడానికి చోటు ఇవ్వకూడదుని అర్థం. అందువల్ల మీకు నష్టమే కానీ లాభం లేదు అని ఈ కొనేటి నాయుడు ,హండే రాజు, బిజాపుర సూల్తన్ రాజులు ప్రత్యేకను నిశితంగా పరిశీలించినాము. కథ సారాంశను కలహం పై గమనించి గుర్తించాల్సి ఆవశ్యకత ముఖ్యంగా నేటి యువత,ప్రజలు మనందరిపై ఎంతైనా వుంది.

**– కుందుర్పి, ఫిబ్రవరి 8, మనం న్యూస్**

## రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన మంత్రి సవిత

**పెనుకొండ ఫిబ్రవరి 8 మనం న్యూస్:** పెనుకొండ మండలంలోని గుట్టూరు జాతీయ రహదారి వద్ద హిందూపురం నుంచి ధర్మవరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు అనంతపురం నుంచి బెంగళూరు వెళ్తున్న లారీని ఢీకొనగా బస్సులో ఉన్న 10 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డు ప్రమాద బాధితులను పోలీసులు పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న మంత్రి సవిత ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించి, ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు ఆదేశించారు.





## గుత్తి కోట శ్రీ నగరేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

**గుత్తి ఫిబ్రవరి 08 మనం న్యూస్:** గుత్తి కోటలోని అతి పురాతనమైన శ్రీ నగరేశ్వర స్వామి దేవాలయంలో మాఘమాసం మూడవ ఆదివారం సందర్భంగా ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారి మూలమూర్తికి వేకువజామున సుగంధద్రవ్యాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయంలో స్వామివారి మూలమూర్తికి విశేష పూజలు నిర్వహించారు. భక్తాదులు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యల స్వామి వారిని దర్శించుకున్నారు.వచ్చిన భక్తులకు గూగూడు కుల్లాయి శెట్టి ఆధ్వర్యంలో ఆలయ ఆలయ ఆవరణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గూగూడు కుళాయి శెట్టి మాట్లాడుతూ.. మాఘమాసం మూడవ ఆదివారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. ఆలయంలో వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించమన్నారు. శివ



స్వాములతో ఆలయం కిటకిటలాడింది. శివనామస్మరణంతో ఆలయం మారు మోగింది.ఈ కార్యక్రమంలో గురు స్వాములు ఖాసిం,అనిల్, శివ, ఈశ్వర్, పగిడిరాయి అశోక్, శివ, శివప్ప, మల్లికార్జున, బాలు, గురు స్వాములు, గూగూడు కుల్లాయి శెట్టి, భక్తాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోషల్ మీడియా అవార్డు గ్రహీత అయిన కే ఎస్ కే సునీల్ కు పూలమాలవేసి శాలువాతో సత్కరించి సన్మానించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు.

# శిరగంవాండ్లపల్లిలో శ్రీ సీతారామ లక్ష్మణ, హనుమ విగ్రహాల ప్రతిష్ఠ



- ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి, సవితమ్మ...బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్..... రెడ్ క్రాస్ సంస్థ జిల్లా అధ్యక్షులు జి యం సురేష్..
- శ్రీరాముడు సత్యం ధర్మం పరిపాలన దక్షతకు చిహ్నం...
- రాష్ట్రమంత్రి సవితమ్మ.....
- హిందూ సాంప్రదాయంలో అత్యంత పవిత్రమైంది శ్రీ రామాలయం....
–, బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్.....



**గోరంట్ల ఫిబ్రవరి 8 మనం న్యూస్:** హిందూ సాంప్రదాయంలో అత్యంత పవిత్రమైంది శ్రీ రామాలయం అని రాష్ట్ర బీసీ సంక్షేమం చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ పేర్కొన్నారు. గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని సిరగం వాండ్లపల్లిలో గ్రామ ప్రజల ఆధ్వర్యంలో వేద పండితులు పట్టణ పురోహితులు తారనాథ శర్మ, వారి కుమారుడు మేఘ నాథ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం సీతా రామ లక్ష్మణ హనుమల విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీసీ సంక్షేమం చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్, రెడ్ క్రాస్ సంస్థ జిల్లా అధ్యక్షులు జిఎం సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి సవితమ్మ మాట్లాడుతూ... హిందూ సాంప్రదాయంలో అత్యంత పవిత్రమైంది శ్రీ రామాలయం అని, రామాలయం లేని ఊరు...ఉరే కాదని అనే నానుడి పూర్వీకుల నుండి ఇప్పటివరకు ఉందని, అందుకే మనం మన సాంప్రదాయాలను మన దేవత మూర్తులను కొలుచుకుంటూ ఆచరించాలని, అప్పుడే మనం మనం మన భావితారాల యువతకు కూడా స్ఫూర్తిదాయక మైతామని, ఇక శ్రీరాముడు అంటానే... సత్యం ధర్మం పరిపాలన దక్షతకు చిహ్నంగా శ్రీరామున్ని పలుకుతారని, రామరాజ్యంలో సత్యం ధర్మం నాలుగు పాదాల నడిచిన కాలంగా గొప్పగా చెబుతారని రామరాజ్యాన్ని గురించి రామాలయ విశిష్టతను గూర్చి గొప్పగా తెలిపారు. బిజెపి జిల్లా అధ్యక్షులు జయం శేఖర్ మాట్లాడుతూ...శ్రీరాముని పరిపాలన, అంటే రామరాజ్యం, న్యాయం, ధర్మం, సమ సమానత్వం మరియు ప్రజా సంక్షేమానికి మారుపేరని, శ్రీరాముడు, తన ప్రజల సుఖసంతోషాలే పరమావధిగా ఆదర్శవంతమైన 'ధర్మరాజ్యం'ను అందించాడని,ఈ పాలనలో ఆకలిదప్పులు, అన్యాయాలు, అక్రమాలు, మరియు నేరాలకు తావు లేని సంపూర్ణ శాంతి ఉండేదని, రాముడు తన రాజ్యంలో ప్రతి నిర్ణయాన్ని ధర్మం మరియు న్యాయం ఆధారంగా తీసుకునేవాడు, ధనికులు-పేదలు అనే తేడా లేకుండా ప్రజలందరినీ సమానంగా చూసేవాడని ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించేవాడని, దేశం సస్య శ్యామలంగా ఉంటూ, పంటలకు, వర్షాలకు లోటు లేకుండా ప్రజలు ఆనందమయమైన జీవితాన్ని గడిపారని,రామరాజ్యం కేవలం పౌరాణిక భావన మాత్రమే కాదని, ఒక పరిపూర్ణ ప్రజాస్వామ్య, ఆదర్శవంతమైన పరిపాలనా విధానానికి ప్రతీకగా నేటికీ నిలిచి ఉందని, జిఎం శేఖర్ తెలిపారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర మంత్రి సవితమ్మను, జిఎం శేఖర్ ను, జిఎం సురేష్ ను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.







# పదవ తరగతి విద్యార్థుల వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక పై జిల్లా కలెక్టర్ వీక్షణ సమావేశం..

**పుట్టపర్తి ఫిబ్రవరి 8 మనం న్యూస్:** సత్యసాయి జిల్లాలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల నూరు రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మండల విద్యాశాఖ అధికారులు , ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో ఆదివారం వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్లిప్ టెస్ట్ లో సి మరియు డి గ్రేడ్ సాధించిన విద్యార్థులను 45 రోజులు మండల పరిధిలోని వసతి గృహాల్లో ఉంచి వారికి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి వారి అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచుటకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల కేంద్రాల్లో ఉండే వసతి గృహాల్లో పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి వారికి తగు శిక్షణ ఇప్పించవలసిందిగా ఆదేశించారు. డ్రాపోర్ట్స్, వసతి గృహాల్లో ఉండబోవు సి గ్రేడ్ మరియు డీ గ్రేడ్ విద్యార్థుల యొక్క తల్లిదండ్రుల అంగీకారంతో వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు.

ఎఫ్ఎల్ఎన్‌కు సంబంధించి ఎండ్లైన్ టెస్ట్ నిర్వహించుటకు సంసిద్ధంగా ఉండాలని ఉపాధ్యాయులకు ఆదేశించడం జరిగింది. ఈ వీక్షణ సమయంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి కృష్ణప్ప బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజేంద్ర ప్రసాద్ రెడ్డి ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ రెడ్డి బాలాజీ మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే పాఠశాలల కన్వీనర్, మండల విద్యాశాఖ అధికారులు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. పదవ తరగతి విద్యార్థుల నూరు రోజుల కార్యాచరణ ప్రణాళికపై జిల్లా కలెక్టర్ వీక్షణ సమావేశం సత్యసాయి జిల్లాలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల నూరు రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ శ్రీ ఏ. శ్యాం ప్రసాద్ ఐఏఎస్ మండల విద్యాశాఖ అధికారులు మరియు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన స్లిప్ టెస్ట్‌లో సి, గ్రేడ్ సాధించిన విద్యార్థుల ను గుర్తించి, 45 రోజులపాటు మండల పరిధిలోని వసతి గృహాల్లో ఉంచి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈ శిక్షణ ద్వారా వారి అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మండల కేంద్రాల్లో ఉన్న వసతి గృహాల్లో పదవ తరగతి విద్యార్థులకు అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేసి, నాణ్యమైన బోధన అందించాలన్నారు. అలాగే డ్రాపౌట్స్ మరియు వసతి గృహాల్లో చేరని సి, డి గ్రేడ్ విద్యార్థులకు వారి తల్లిదండ్రుల అంగీకారంతో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఎఫ్ఎల్ యన్ కు సంబంధించి ఎండ్‌లైన్ టెస్ట్ నిర్వహించేందుకు ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ జి. కృష్ణప్ప, బీసీ వెల్ఫేర్ అధికారి రాజేంద్ర ప్రసాద్ రెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి రెడ్డి బాలాజీ, మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే పాఠశాలల కన్వీనర్, మండల విద్యాశాఖ అధికారులు మరియు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# మా మూత్రాలపై నడవండి అపవిత్రులు కండి

- కుందుర్పిలో నయా నాగరికత
-రోడ్డుపైకి నీరు వదలడంలో వీరిదే పైచేయిగా నిలచినది.
-ఎవ్వరు ఏన్ని నీతులు చెప్పిన మేము మారము అంతే.
- మేము నీరును వదలితీరుతాము అంతే. మేము బాగుండాలి ఏవ్వరు ఇబ్బందులు పడితే మాకేమి



**కుందుర్పి , ఫిబ్రవరి, 8, మనంన్యూస్:** కుందుర్పి ప్రధాన రహదారిలో 14 లేక 15 ఇండ్ల వాసులు స్నానపు నీళ్లు, విసర్జించిన మూత్రాలు రోడ్డుపై వదిలేసి నవ్విపోదురు గాక, నాకేటి సిగ్గు అన్న చందాన చోద్యం చూస్తున్నారు. పవిత్రమైన హిందూ సాంప్రదాయంలో స్నానమాచరించి భక్తిశ్రద్ధలతో కుందుర్పి ఎగువ బాగాన ఉన్న లక్ష్మీ వెంకటేశ్వర, పేటా చెన్నకేశవ విష్ణుమూర్తి, వీరభద్ర,కుందుర్పమ్మ, కాలభైరవ, నీలకంఠ శ్వర, పురాతన ఆలయాల దర్శనానికి వెళ్లాలంటే పవిత్రులు కూడా ఈ రహదారిపై నడచి అపవిత్రులు కావాల్సిందే. ఇది ఏమిటి అని ఎవరైనా ప్రశ్నిస్తే కళ్యాణదుర్గం ఆర్డీవో నిశాంత్ రెడ్డి, అప్పటి జిల్లా కలెక్టర్ గౌతమి, లే మా మూత్రంపై నడిచి వెళ్లారు .ఇక సామాన్యులైన మీరెంత అనే విధంగా ఎవరిని లక్ష్య పెట్టకుండా వారి పని వారు ప్రశాంతంగా చేసుకుంటూ వెళ్తున్నారు. స్థానిక తహసిల్దార్, ఎంపీడీవో, ఎస్సై రెవిన్యూ సిబ్బంది పంచాయతీ సిబ్బంది సచివాలయ సిబ్బంది, డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది, అప్పుడప్పుడు ఎక్సైజ్ సిబ్బంది ప్రతి ఒక్కరూ ఈ రోడ్డుపై దావాలనంగా పారుతున్న స్నానపు నీరు, మూత్రాలపై నడవాల్సిందే. అవసరమైతే వారు లేకుంటే వారి వాహనాలు అపవిత్రం కావాల్సిందే. స్థానిక రాజకీయ నాయకులు, అప్పుడప్పుడు ఎమ్మెల్యే కూడా వీటిపై నడవాల్సిందే. ఒకానొక సందర్భంలో దీనిపై చర్యలు తీసుకోవాలని అప్పటి కలెక్టర్ ఎం, గౌతమి కళ్యాణదుర్గం ఆర్డీవో నిశాంత్ రెడ్డినీ ఆదేశించారు. ఇది జరిగి సంవత్సరం గడుస్తున్నా ఇంతవరకు దీనికి సంబంధించి నివారణ చర్యలు తీసుకోవాలనే ఆలోచన కూడా కలుగకపోవడం అధికారుల ఉదాశీనతకు తాత్కాణం. ప్రస్తుత కొత్త ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ ప్రజా సమస్యల సాధనకై కృషి చేస్తున్న నూతన ఎమ్మెల్యే ఆమిలినేని సురేంద్రబాబు దీనిపై దృష్టి సారించి పాదచారులకు, వాహన చోదకులకు ఈ దౌర్భాగ్యం నుంచి విముక్తి కలిగించాలని స్థానికులు కోరుతున్నారు. మేము మారము,అంతే,మాది చివరికి పైచేయిగా నిలచినది.మేము రోడ్డు మీద నీరును నిరంతరంగా వదులుతానే వున్నాము. మిరు చేతనైతే అడ్డు కోండి చుద్దాం అన్న రీతిలో వ్యవహరిస్తారు. వీరిపైన రోడ్డు లో సంచరించేవారుకు మురుగు అపరిశుభ్రత నీరు వ్యక్తులుపై పడగా అసహించుకొని నీరు విడిచేవారిని కొంతమంది పౌరులు శాపనార్థాలు పెట్టారు. ఇప్పటికైనా కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని, సురేంద్రబాబు, జిల్లా కలెక్టర్ ఆనంద్ చర్యలు తీసుకోవాలసిన అవసరం ఎంతైనా ఉంది.

# గాయపడిన సీఐ, కానిస్టేబుల్‌ను పరామర్శించిన మంత్రి సవితమ్మ

**హిందూపురం (మనం న్యూస్) ఫిబ్రవరి 08:** శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో విధి నిర్వహణలో పోలీసులపై కత్తి దాడి ఘటన జరిగింది. పలు కేసుల్లో నిందితుడైన నాగేంద్రను అరెస్ట్ చేస్తుండగా, సీఐ ఆంజనేయులు, కానిస్టేబుల్ రవి ఇద్దరినీ కత్తితో దాడి చేసి గాయపరిచారు. గాయాలతో హిందూపురం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న పోలీసులను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు శ్రీమతి సవితమ్మ పరామర్శించారు. మంత్రి సవితమ్మ మాట్లాడుతూ, పోలీసులు సమాజ రక్షణ కోసం ప్రాణాధారంగా పనిచేస్తున్నారు,వారిపై జరిగిన ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తు నిందితుడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





